Follow: @mahaadaily
24-12-2025
# మహా పత్రిక
ANN తెలుగు
బుధవారం, హైదరాబాద్
సంపుటి- 22 సంచిక- 365 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## జనవరి 31లోగా ప్రభుత్వ శాఖల్లో ఈ ఫైలింగ్

ఇక ఫైళ్ళు పట్టుకుని తిరగొద్దు

ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం రేవంత్

నేడు కొడంగల్ కు సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా:** జనవరి 31 లోగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఈ ఫైలింగ్ విధానం అమలు చేయాలని, కాగితాలు, ఫైళ్లు పట్టుకొని తిరిగే పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా శాఖల పరిధిలోని కార్యక్రమాల అమలుకు ప్రత్యేకంగా డాష్ బోర్డు సిద్ధం చేసి దాన్ని సీఎస్, సీఎంఓ డాష్ బోర్డుతో అనుసంధానం చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం అన్ని విభాగాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో అన్ని శాఖల కార్యదర్శులకు కీలక సూచనలు చేశారు. గతంలో ఎనర్జీ, విద్య, ఇరిగేషన్, హెల్త్ వంటి ముఖ్య రంగాలకు స్పష్టమైన పాలసీలు లేకపోవడంతో అనేక సమస్యలు తలెత్తాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

### మళ్లీ బిర్యానీయే టాప్



- వరుసగా పదో ఏడాది అగ్రస్థానం
- 2025లో 9.3 కోట్ల బిర్యానీ ఆర్డర్లు నమోదు
- స్విగ్గీ వార్షిక నివేదిక

02

### లిక్కర్ క్యాపిటల్‌గా తెలంగాణ



- మద్యం వినియోగంలో దక్షిణాదిలో టాప్
- ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ.11,351 మద్యం ఖర్చు

02

### ఈవీల జోరు

- భారత రోడ్లపై 2.5 లక్షల టాటా కార్లు
- దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా చార్జింగ్ పాయింట్లు



02



## సీఐడీ విచారణకు మంచు లక్ష్మి

బెట్టింగ్ యాప్‌ల కేసులో విచారణ

**హైదరాబాద్, మహా:** నిషేధిత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వ్యవహారంలో సినీ నటి మంచు లక్ష్మి హైదరాబాద్ లక్డీకాపూల్ లోని సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి అధికారులు ఆమెను ప్రశ్నించారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేయడానికి మంచు లక్ష్మి ఎంత మొత్తంలో పారితోషికం తీసుకున్నారు? కమీషన్ల రూపంలో ఎంత ఆదాయం పొందారు? అనే అంశాలపై సీఐడీ అధికారులు ప్రధానంగా ఆరా తీశారు. ఈ బెట్టింగ్ యాప్‌ల కేసు కొత్తది కాదు. గతంలో ఇదే వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా మంచు లక్ష్మిని విచారించింది. అప్పట్లో ఆమె ఆర్థిక లావాదేవీలపై, యాప్‌ల ప్రచారానికి సంబంధించిన ఒప్పందాలపై ఈడీ అధికారులు ప్రశ్నలు సంధించారు.



# ప్రధానిగా ప్రియాంక గాంధీ

## తథ్యమన్న రాబర్ట్ వాద్రా

జాతీయ రాజకీయాల్లో సంచలనం

యువత, మహిళల్లో పెరుగుతున్న ఆదరణ

రాజకీయాల్లో ఆమె ఎదుగుదలను ఎవరూ ఆపలేరని వ్యాఖ్య

ఇందిరా గాంధీతో పోలుస్తూ కాంగ్రెస్ ఎంపీ చేసిన వ్యాఖ్యలపై స్పందన

తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ నుంచి ఎంతో నేర్చుకున్నారన్న వాద్రా

రాహుల్ ప్రధాని కావాలని కోట్ల మంది కాంగ్రెస్ అభిమానుల కోరిక

2024లో తృటిలో మిస్.. గాంధీ కుటుంబం పై మోదీ కుట్రలంటున్న అభిమానులు

**మహా ప్రత్యేకం:**

దేశ రాజకీయాల్లో, కాంగ్రెస్ రాజకీయాల్లో ఓ సంచలన నినాదం మొదలైంది. భారత రాజకీయాల్లో ప్రియాంక గాంధీ రోజురోజుకూ క్రియాశీలమవుతూ బలమైన ముద్ర వేస్తుండగా, ప్రియాంక గాంధీ ప్రధాని కావడం తథ్యమే అని ఆమె భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాచేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో సంచలనం రేపుతున్నాయి. ప్రియాంక గాంధీ రాజకీయ

మిగతా 2లో

## కేసీఆర్, హరీష్‌లకు సిట్ నోటీసులు

అసెంబ్లీ ముగియగానే ఇచ్చే ఛాన్స్.. వేగంగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ



**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ సంచలనాలు మొదలయ్యాయి. ఈ కేసులో ప్రభాకర్ రావును ప్రధాన నిందితుడిగా భావిస్తుండగా, ప్రభాకర్ రావుతో ఓ టీవీ చానల్ యాజమానిని జతచేసింది హరీష్‌రావుగా ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. ఎవరెవరి నెంబర్లు శ్రావణ్ రావు ద్వారా చేరాయి.. ఎవరి సమాచారం ఎప్పటికపుడు సేకరించి ఇబ్బందులకు గురిచేశారని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ ఎవరి కోసం చేశారు.. ఎవరి ఆదేశాల మేరకు చేశారన్న దారిపై సిట్ ప్రధానంగా ఫోకస్ పెట్టింది. ఈ నేపథ్యంలోనే మాజీ సీఎం కేసీఆర్ తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావు కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని యోచిస్తున్నట్లుగా సమాచారం. అయితే, ఎంక్వైరీలో ప్రభాకర్ రావు పదేపదే అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డితో పాటు అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్ పేర్లను ప్రస్తావనకు తెస్తున్నట్లుగా సిట్ చీఫ్ సజ్జనార్ గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో మహేందర్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేసిన విషయం తెలిసిందే.

మిగతా 2లో

## బరితెగించి హరీష్ అబద్ధాలు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్

**హైదరాబాద్. మహా :** ఇరిగేషన్ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు బరితెగించి అబద్ధాలు మాట్లాడుతున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సెక్రెటేరియట్‌లో మంత్రి మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో పాలమూరురంగారెడ్డికి రూ.7వేల కోట్లు ఖర్చు చేశామని.. వాటి లెక్కలు చెప్తామని అన్నారు. తాము వచ్చాక రెండేళ్లలో ప్రాజెక్టు కోసం 67 లక్షల క్యూబిక్ మీటర్ల ఎర్త్ వర్క్ జరిగిందని.. 7 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రిట్ వర్క్ జరిగిందన్నారు.



మిగతా 2లో



## కేరళలో 24 లక్షల మంది ఓటర్ల తొలగింపు

**మహా:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుపుతున్న రెండో విడత ఎన్నికల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా కేరళ , ఛత్తీస్‌గఢ్ ముసాయిదా ఎన్నికల జాబితాను ఎన్నికల కమిషన్ మంగళవారంనాడు ప్రచురించింది. కేరళలో 24 లక్షల మంది పేర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించింది. ఛత్తీస్‌గఢ్‌లో 27 లక్షల మంది పేర్లను తొలగించింది. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో ముసాయిదా జాబాతాను ప్రకటించామని, అన్ని రాజకీయ పార్టీలకు ప్రతులను షేర్ చేశామని ప్రధాన ఎన్నికల కమిషనర్లు ప్రకటించారు.

## అసెంబ్లీ అంటే కేసీఆర్‌కు ఎందుకంత భయం?

తోలు వలుస్తామంటే.. చూస్తూ ఊరుకోం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్

**ఖమ్మం బ్యూరో, మహా:** ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ గత రెండేళ్లలో ఒక్కరోజు కూడా అసెంబ్లీకి ఎందుకు రాలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రశ్నించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో పలు సబ్ స్టేషన్ల పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అసెంబ్లీ అంటే కేసీఆర్‌కు ఎందుకంత భయమని, ప్రజల సమస్యలపై చర్చించే వేదికకు రాకుండా ఫామ్ హౌస్‌కే పరిమితమైతే ఆయనకు ఆ హోదా అవసరమా అని నిలదీశారు. తాము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏనాడూ సభకు గైర్హాజరు కాలేదని, నిరంతరం ప్రజా సమస్యలపై



గళం విప్పామని గుర్తు చేశారు. పదిమంది నాయకులను పక్కన కూర్చు పెట్టుకుని ప్రగల్భాలు పలకడం కాదని, చేతనైతే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు.

మిగతా 2లో



## సిట్ పెద్ద జోక్

- ప్రభుత్వం ఇరుకున పడినపుడల్లా లీకులు
- అసెంబ్లీలో మాకూ పీపీటి ఛాన్స్ ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీష్ రావు చిట్ చాట్

**హైదరాబాద్, మహా:** ప్రభుత్వం ఇరుకున పడినప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ అంటూ లీకులు ఇస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని.. అసెంబ్లీ ముగియగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు నోటీసులు ఇస్తారట అని

మిగతా 2లో

## ఆ కేసు కంటే.. టీవీ సీరియల్స్ త్వరగా అయిపోయాయి

ట్యాపింగ్ కేసుపై కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌లకు సిట్ నోటీసులు ఇవ్వాలని నిర్ణయించడం స్వాగతిస్తున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌అన్నారు. తనతోపాటు అగ్ర నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేయడంతో పాటు ఎన్నో కుటుంబాల్లో చిచ్చు పెట్టారని మండిపడ్డారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ ఆఖరికి కన్న బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ట్యాప్ చేసిన నీచులు, దేశవ్యాప్తంగా మంచి పేరున్న ఎస్ఐబీ వ్యవస్థను రాష్ట్రంలో భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ఎస్ఐబీని అడ్డుపెట్టుకుని బ్లాక్ మెయిల్ చేసి కాంట్రాక్టర్లు, లీడర్ల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు కూడా ఆరోపణలున్నాయన్నారు. కేసీఆర్, కేటీఆర్ లకు నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటారా, పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను తేల్చుతారా అనేది అనుమానంగా ఉందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్



కేసు టీవీ సీరియల్‌లా సాగదీస్తున్నారే తప్ప చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ కేసు సమయంలో ప్రారంభమైన టీవీ సీరియల్స్ ఎపిసోడ్స్ కూడా అయిపోయాయే తప్ప ఫోన్ ట్యాపింగ్ కేసు మాత్రం ఇంకా సాగుతుందని ఎద్దేవా చేశారు



## తమిళనాడులో ఎన్నికల సంక్రాంతి

- పొంగల్ కానుక ప్రకటించిన ప్రభుత్వం
- రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఇంటికీ రూ.3 వేలు

**మహా:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడు స్టాలిన్ సర్కారు వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రజలను ఆకట్టుకోవడానికి సంక్రాంతి కానుక ప్రకటించింది. ఎన్నికల ముంగిట వస్తున్న పండుగ కావడంతో ఈసారి పొంగల్ కానుక భిన్నంగా ఉండనుంది.

మిగతా 2లో

### జర్నలిస్టుల అక్రెడిటేషన్స్ కొత్త జీ.ఓను సవరించాలి: టీయుడబ్ల్యుజే డిమాండ్

10వేల కార్డులకు కోతపెట్టేలా కొత్త జీవో

వివరాలు 2లో

### శివాజీపై భగ్గుమన్న చిత్రపరిశ్రమ

అనసూయ, చిన్మయి, మంచు లక్ష్మి సహా అనేకమంది ఫైర్

08

## బరితెగించి హరీష్ అబద్ధాలు

(మొదటిపేజీ తరువాయి)

9 కిలోమీటర్ల ప్రెజర్‌మేన్స్ లెన్త్ చేశామని.. వారి హయాంలో ఒక్క పంపు ఇన్‌స్టాలేషన్ చేయగా. తాము మరో 11 పంపుల ఇన్‌స్టాలేషన్ చేశామని వెల్లడించారు. అనుమతుల మీదా అన్నీ అబద్ధాలు చెప్పారని.. హైడ్రాలజీ అనుమతి లేదని.. పర్యావరణ క్లియరెన్స్ లేదని అన్నారు. ఏం సాధించుకున్నా ఎలా మాట్లాడుతున్నారో వారికే తెలియాలన్నారు. పాలమూరురంగారెడ్డి పనులు 90 శాతం పనులు పూర్తి చేశామని కేసీఆర్ అంటున్నారని.. అసలు వారి హయాంలో జరిగిన పనులు 30 నుంచి 40 శాతం మాత్రమేనని వెల్లడించారు. కేసీఆర్‌కు పాలమూరు కట్టాలని లేదని ఆరోపించారు. 2020లో సెంట్రల్‌కు పంపిన నీటి వాటాల పంపకాల్లో పాలమూరు, ఎస్ఎల్‌బీసీకి, డిండికి నీళ్లు అడుగలేదని అన్నారు.

## తమిళనాడులో ఎన్నికల సంక్రాంతి

(మొదటిపేజీ తరువాయి)

పొంగల్ సందర్భంగా తమిళనాడులోని రేషన్ కార్డుదారులకు రూ.3వేల నగదు, నిత్యావసరాలతో పాటు ఓ ధోతి, చీర కూడా ఇవ్వనున్నట్లు పేర్కొంది. తమిళనాడు పొంగల్ గిఫ్ట్ పథకం 2026 లో భాగంగా అర్హులైన ప్రతీ కుటుంబానికి రూ.3 వేల నగదుతో పాటు గిఫ్ట్ హ్యాంపర్‌ను అందించనున్నట్లు తెలిపింది. జనవరి రెండవ వారంలో సీఎం ఎంకే స్టాలిన్ ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. పంపిణీ ప్రక్రియను సులభతరం చేయడానికి జనవరి మొదటి వారంలో రేషన్ షాపు సిబ్బంది ఇంటింటికీ తిరిగి టోకెన్లు పంపిణీ చేస్తారు. దానిపై పేర్కొన్న తేదీ, సమయం ఆధారంగా లబ్ధిదారులు రేషన్ షాప్ లకు వెళ్లి పొంగల్ కానుక అందుకోవచ్చని తమిళనాడు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## సిట్ పెద్ద జోక్

- ప్రభుత్వం ఇరుకునపడినపుడల్లా లీకులు
- అసెంబ్లీలో మాకూ పీపీటి ఛాన్స్ ఇవ్వాలి
- మాజీ మంత్రి హరీష్ రావు చిట్ చాట్

మాజీమంత్రి హరీష్ రావు అన్నారు. ఈ సిట్ ఒక పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ మెప్పు కోసం అక్రమ కేసులు పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకుంటున్నామని.. ఏపీలో అధికారులకు పట్టిన గతే ఇక్కడ పడుతుందని హెచ్చరించారు. రిటైర్ అయినా, విదేశాల్లో ఉన్నా గుంజుకొస్తామని అన్నారు. ఉద్యమంలో తనపై 300 కేసులు ఉన్నాయని.. ఈ తాటాకు చప్పుళ్లకు భయపడబోమని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ తర్వాత రేవంత్ సర్కార్ పూర్తి డిఫెన్స్‌లో పడిందని హరీశ్‌రావు అన్నారు. 25 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఒక సీఎం రాత్రి 9.30 గంటలకు చిట్ చాట్ పెట్టి వివరణ ఇచ్చుకోవడం ఎప్పుడూ చూడలేదన్నారు. సాగునీటిపై ప్రభుత్వం ఇచ్చే పీపీటీని స్వాగతిస్తున్నామని..కానీ వాస్తవాలు చెప్పడానికి బీఆర్ఎస్‌కు కూడా పీపీటీ ఇచ్చే అవకాశం ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం తమకు ఇస్తూ తమ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. అవకాశం ఇస్తే అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ సర్కార్ బండారాన్ని బయటపెడతామన్నారు.

## జనవరి 31లోగా ప్రభుత్వ శాఖల్లో ఈ ఫైలింగ్



(మొదటిపేజీ తరువాయి)

తమ ప్రభుత్వం రెండేళ్లలోనే ప్రధాన విభాగాలకు అవసరమైన విధి విధానాలను రూపొందించినట్లు తెలిపారు. అధికారులు పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రతి నెలా కార్యదర్శుల పనితీరును చీఫ్ సెక్రటరీ సమీక్షిస్తారని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకోసారి తానే స్వయంగా అన్ని శాఖల కార్యదర్శుల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగకూడదు. జనవరి 26 లోపు అద్దె భవనాల్లో ఉన్న కార్యాలయాలను ఖాళీ చేసి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మారాలి. ఖాళీ భవనాలు అందుబాటులో లేకపోతే ఖాళీ స్థలాలను గుర్తించి నిర్ణీత గడువులోగా సొంత భవనాల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలి అని సీఎం సూచించారు.

**నేడు కొడంగల్ కు సీఎం రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం కొడంగల్ నియోజకవర్గం వెళ్ళనున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని సర్పంచ్ లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తన నియోజకవరంగంలోని సర్పంచ్ లను సన్మానించడంతో పాటు గ్రామాల ప్రగతికి ఎలా పనిచేయాలో వివరించనున్నారు.

# ప్రధానిగా ప్రియాంక గాంధీ



(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణాన్ని ఎవరూ అడ్డుకోలేరని, ఆమె ఎదుగుదల అనివార్యమని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రజలు ఒక రోజు ఆమెను అత్యున్నత పదవిలో చూడాలనుకునే సమయం తప్పకుండా వస్తుందని వాద్రా వ్యాఖ్యానించారు. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యల్లో ప్రియాంక గాంధీని మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పోల్చడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ వ్యాఖ్యలపై స్పందించిన వాద్రా, ప్రియాంకలో ఇందిరా గాంధీని గుర్తుచేసే ధైర్యం, ప్రజలతో మమేకమయ్యే శైలి, రాజకీయ స్పష్టత స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు. రాజకీయాల్లో ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ప్రజాస్వామ్యంలో ప్రజల మద్దతే ఆమెను మరింత ముందుకు నడిపిస్తుందని చెప్పారు.

**ప్రజల సమస్యలపై దూకుడు**

రాహుల్ గాంధీ ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు జోడోయాత్ర రెండు విడతలు చేపట్టగా, ఆసేతు హిమాచలం కదిలివచ్చింది. వీటి ఫలితాలు లోక్ సభ ఎన్నికల్లో కూడా కనిపించాయి. ప్రియాంక గాంధీ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యలపై దూకుడుగా స్పందిస్తున్నారు. ఎన్నికల ప్రచారాల్లో ఆమె ప్రసంగాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు, ప్రజల హక్కుల కోసం గళం విప్పడం ఆమెను పార్టీకి బలమైన నాయకత్వ ముఖచిత్రంగా నిలబెడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా యువత, మహిళల్లో ఆమెకు పెరుగుతున్న ఆదరణ గమనించదగ్గదిగా ఉందని చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలు భారత జాతీయ కాంగ్రెస్ లో అంతర్గతంగా కొత్త చర్చలకు తెరలేపాయి. భవిష్యత్తు నాయకత్వం, ప్రధాని అభ్యర్థిత్వం, పార్టీ వ్యూహాలపై ఆలోచనలు మరింత వేగం పుంజుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కొందరు నేతలు ఈ వ్యాఖ్యలను వ్యక్తిగత అభిప్రాయంగా కొట్టిపారేస్తుండగా, మరికొందరు మాత్రం ప్రియాంక గాంధీ జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయంటున్నారు. రాబర్ట్ వాద్రా వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత విశ్వాసం మాత్రమే కాకుండా, కాంగ్రెస్ పార్టీలో భవిష్యత్తు నాయకత్వంపై జరుగుతున్న లోతైన చర్చలకు ప్రతిబింబంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రియాంక గాంధీ రాజకీయ ప్రయాణం ఎటు దారి తీస్తుందో, ఆమె ప్రధాని అభ్యర్థిత్వం నిజంగా తథ్యమవుతుందో అన్నది రానున్న రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉండనుంది.

**అంతా రాహుల్**

ప్రస్తుతం జాతీయకాంగ్రెస్ అంతా రాహుల్ గాంధీ చేతుల్లో ఉంది. రాహుల్ యాత్రలు విజయవంతం కావడం వల్ల లోక్ సభ ఎన్నికల్లో అధికారపీఠానికి అత్యంత చేరువగా కాంగ్రెస్ పార్టీ వచ్చింది. రాహుల్ ప్రధాని కావాలన్నది కోట్లాది కాంగ్రెస్ కార్యకర్తల కోరిక. ఇందిరమ్మ రూపంలో ఉన్న ప్రియాంక గాంధీ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుగా, పెద్ద ఎస్సెట్ గా రాజకీయవర్గాలు, ప్రజలు భావిస్తారు. ఈ జోడీ దేశరాజకీయాల్లో సంచలనాలు క్రియేట్ చేయడం ఖాయమని, భవిష్యత్తు వీరిదేనని కాంగ్రెస్ క్యాడర్ చెబుతున్నారు. లోక్ సభలో ప్రియాంకగాంధీ ప్రసంగాలకు లభించిన స్పందన, అధికార పక్షంతో పరిణతితో వ్యవహరించిన పద్ధతులు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. రాహుల్ గాంధీ రాజ్యాంగ, ఓట్ చోరీ అంశాలపై మాట్లాడుతుండగా, సామాన్యుల అంశాలపై ప్రియాంక గాంధీ మాట్లాడుతున్నారు. ఇపుడు ప్రియాంక గాంధీ ప్రధాని అన్న వ్యాఖ్యలు వ్యక్తిగత కోరికలు.. తెరవెనుక కాంగ్రెస్ పార్టీ వ్యూహమేమైనా ఉందా? అన్నది రానున్నరోజుల్లో స్పష్టత వస్తుంది. ఈ నినాదం మాత్రం జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది.

## ఎన్నికలొస్తే ఖైరతాబాద్ బీఆర్ఎస్ దే...

### బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ మన్నె గోవర్ధన్ రెడ్డి



**మహా :** ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎపుడు ఎన్నికలు జరిగినా బిఆర్ఎస్ పార్టీ విజయం తథ్యమని ఖైరతాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం ఖైరతాబాద్ డివిజన్‌లో అంజన్ కుమార్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం విజయవంతం అయింది. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ ఇంచార్జ్ మన్నే గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ: "రాబోయే ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, రైతుల హక్కులకు, యువత ఉపాధికి, మహిళల సాధికారతకు అంకితమైన పార్టీ. కేసీఆర్ గవ దూరదృష్టి, సంక్షేమ పథకాలు ద్వారా లక్షలాది మంది జీవితాలు మార్చారని అన్నారు. ఇప్పుడు కార్యకర్తలు బూత్ స్థాయిలో దృఢంగా నిలబడి, పార్టీని మరింత బలపరచాలి!"అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ గజ్జల ఆనంద్ , శ్యామ్ తాంద్ర మేఘన, శ్రీను, బూత్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఆగని మతోన్మాద వికటాట్టహాసం

**ఢిల్లీ, మహా:** బంగ్లాదేశ్‌లో అల్పసంఖ్యాక వర్గాలపైన జరుగుతున్న అకృత్యాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. తాజాగా చట్టోగ్రామ్ ప్రాంతంలోని జయంత్ సంగా, బాబు సుకిశిల్ అనే వ్యక్తుల నివాసాలను లక్ష్యంగా చేసుకుని దుండగుల సమూహం విరుచుకుపడింది. బాధితులు ఇస్లాం వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారనే నెపంతో ఆ మూక దాడికి ప్రయత్నించింది. అప్రమత్తమైన బాధితులు ఇంటి వెనుక వైపున ఉన్న ఇనుప కంచెను కోసి అక్కడి నుండి తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. బాధితులు చిక్కకపోవడంతో ఆగ్రహంతో ఊగిపోయిన దుండగులు వారి గృహాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ నివాసాలలో ఉన్న వస్తువులను చిందరవందర చేస్తూ భీభత్సం సృష్టించారు. ఈ క్రమంలోనే అక్కడ పెరుగుతున్న మూగజీవాలను సైతం దారుణంగా ప్రాణ తీశారు. వారి క్రూరత్వానికి ఇది పరాకాష్టగా నిలిచింది. దాడి జరిగిన ప్రదేశంలో అల్లరిమూకలు ఒక హెచ్చరిక పత్రాన్ని విడిచివెళ్లారు. ఆ పత్రంలో బెంగాలీ భాషలో రాస్తూ "ఈ ప్రాంతంలోని హిందువుల కదలికలను గమనిస్తున్నాం. వెంటనే మీ పద్ధతులు మార్చుకోవాలి. లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని పేర్కొన్నారు. బాధితుల ఆస్తులను, వ్యాపారాలను సైతం నాశనం చేస్తామని, తమ నుండి ఎవరూ రక్షించలేరని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఏడాది ప్రారంభం నుండి ఆ దేశంలో సుమారు 258 దాడులు చోటుచేసుకోగా 27 మంది మరణించారు. మరణించిన వారిలో అత్యధికులు హిందూ మతస్థులే కావడం గమనార్హం.

## అసెంబ్లీ అంటే కేసీఆర్‌కు ఎందుకంత భయం?

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన 'తోలు తీస్తాం' అనే వ్యాఖ్యలపై భట్టి విక్రమార్క ఘాటుగా స్పందించారు. కేసీఆర్ ఆ తోలు వలిచే ఉద్యోగం ఎప్పుడు తీసుకున్నారో చెప్పాలని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రెండు సంవత్సరాల పాటు ఫామ్ హౌస్‌లో పడుకొని, ఇప్పుడు బయటకు వచ్చి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. తాము ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంటే ఆశీర్వదించాల్సింది పోయి, తోలు వలుస్తాం అనడం సరికాదని, ఇక్కడ ఎవరూ ఖాళీగా లేరని, అలాంటి మాటలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రం ఇప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, దేశవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు తెలంగాణ వైపు చూస్తున్నారని, ఈ ప్రగతిని చూసి ఎక్కడ తమ ఉనికి కోల్పోతామో అన్న ఆందోళనతోనే కేసీఆర్ అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని 94 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే, అందులో 85 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక మెజారిటీతో విజయం సాధించారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు 85 శాతం మందిని సర్పంచులుగా గెలిపించి తమ ఇందిరమ్మ రాజ్యానికి పట్టం కట్టారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను పక్కన కూర్చోబెట్టిన ప్రజలు, తాజాగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో అంతకన్నా ఎక్కువ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించారని చెప్పారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు తమ తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## మళ్లీ బిర్యానీయే టాప్

- వరుసగా పదో ఏడాది అగ్రస్థానం
- 2025లో 9.3 కోట్ల బిర్యానీ ఆర్డర్లు నమోదు
- స్విగ్గీ వార్షిక నివేదిక

**మహా:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ 2025 వార్షిక నివేదికను విడుదల చేసింది. ఈ ఏడాది కూడా భారతీయులు బిర్యానీకే జై కొట్టారు. వరుసగా పదో ఏడాది కూడా దేశంలో అత్యధికంగా ఆర్డర్ చేసిన వంటకంగా బిర్యానీ అగ్రస్థానంలో నిలిచింది. 2025లో స్విగ్గీ ద్వారా ఏకంగా 9.3 కోట్ల బిర్యానీ ఆర్డర్లు డెలివరీ అయినట్లు నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం ఈ ఏడాది దేశవ్యాప్తంగా నిమిషానికి సగటున 194 బిర్యానీలు, అంటే ప్రతి 3.25 సెకన్లకు ఒక బిర్యానీ ఆర్డర్ నమోదైంది. మొత్తం బిర్యానీ ఆర్డర్లలో చికెన్ బిర్యానీదే సింహభాగం. సుమారు 5.77 కోట్ల ఆర్డర్లతో చికెన్ బిర్యానీ టాప్‌లో ఉంది. బిర్యానీ తర్వాత బర్గర్ (4.42 కోట్లు), పిజ్జా (4.01 కోట్లు) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. భారతదేశంలో ఫుడ్ ట్రెండ్స్ మారినా, బిర్యానీపై ప్రేమ మాత్రం స్థిరంగా ఉందని స్విగ్గీ తన నివేదికలో పేర్కొంది. "బిర్యానీ తిరుగులేని రాజు అని మరోసారి రుజువైంది. ఈ సుగంధభరితమైన వంటకంపై భారతీయుల ప్రేమ ఎప్పటికీ తగ్గదు" అని తెలిపింది.

## ఈవీల జోరు

- భారత రోడ్లపై 2.5లక్షల టాటా కార్లు
- దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా చార్జింగ్ పాయింట్లు

**మహా:** భారత రోడ్లపై 2.5 లక్షలకు పైగా టాటా ఎలక్ట్రిక్ కార్లు పరుగులు తీస్తున్నాయి. ఇది భారత ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన మార్కెట్లో టాటా మోటార్స్ ఆధిపత్యాన్ని తెలియజేస్తోంది. భారత్‌లో అమ్ముడయ్యే ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల్లో సుమారు 66 శాతం వాటా టాటా మోటార్స్‌దే. అంటే రోడ్లపై కనిపించే ప్రతి మూడు ఈవీల్లో రెండు టాటా వాహనాలే. చార్జింగ్ సౌకర్యాల పరంగా కూడా టాటా ముందంజలో ఉంది. దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా చార్జింగ్ పాయింట్లకు టాటా యాక్సెస్ కల్పిస్తోంది. ఇప్పటికే ప్రధాన రహదారులు, నగరాల్లో 100 మెగా ఫాస్ట్ ఛార్జింగ్ హబ్‌లు పనిచేస్తున్నాయి.

## కేసీఆర్, హరీష్‌లకు సిట్ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

దీంతో అసెంబ్లీ సమావేశాల అనంతరం ఫోన్ ట్యాపింగ్ కేసులో ఊహించని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

**పక్కాగా అడుగులు**

అదేవిధంగా ఫోన్ ట్యాపింగ్ రివ్యూ కమిటీలో సభ్యులైన మాజీ సీఎస్‌లు సోమేష్ కుమార్, శాంతికుమారి, ఇతర అధికారులు తిరుపతి, శేషాద్రిలను సిట్ విచారించిన విషయం తెలిసిందే. అయితే, తమ దగ్గరికి ప్రభాకర్ రావు కొన్ని వేల నెంబర్లు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఎస్‌బీఐ మీద ఉన్న నమ్మకంతో సంఘ విద్రోహులు, మావోయిస్టులు, టెర్రరిస్టులపై ఫోకస్ పెడతారని ఆ నెంబర్లను తాము వెరిఫై చేయలేకపోయామని సమాధానమిచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎఫ్ఎస్ఎల్ ఓ ప్రముఖ న్యూస్ ఛానల్ ఎండీ శ్రవణ్ రావు , మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు కు మధ్య సంభాషణలను రీట్రీవ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ డేటాను ఆధారంగా చేసుకుని సిట్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు నోటీసులు ఇస్తారనే సమాచారం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## లిక్కర్ క్యాపిటల్ గా తెలంగాణ

### మద్యం వినియోగంలో దక్షిణాదిలో టాప్
### ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ.11,351 మద్యం ఖర్చు

**మహా:** దక్షిణాది రాష్ట్రాల్లో మద్యం వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచి 'లిక్కర్ క్యాపిటల్'గా మారింది. దేశ సగటుతో పోలిస్తే ఇక్కడ తలసరి మద్యం వినియోగం ఎక్కువగా ఉండటం గమనార్హం. ఏడాదికి సగటు తలసరి ఆల్కహాల్ వినియోగం 4.44 లీటర్లుగా ఉండగా, కర్ణాటక (4.25 లీటర్లు), తమిళనాడు (3.38 లీటర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏపీ 2.71 లీటర్లతో నాలుగో స్థానంలో ఉండగా, కేరళ 2.53 లీటర్లతో చివర్లో నిలిచింది. తెలంగాణలో ముఖ్యంగా బీరు వినియోగం గత ఏడాది కాలంలో అనూహ్యంగా పెరిగింది. వేసవికే పరిమితం కాకుండా ఏడాది పొడవునా బీరు వినియోగం సాగుతోంది. ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ.11,351 మద్యం కొనుగోలుకు ఖర్చు చేస్తున్నారు. ఇది దేశంలోనే అత్యధికం. అదే సమయంలో ఏపీలో సగటు వ్యక్తి ఏడాదికి రూ.6,399 మాత్రమే ఖర్చు చేస్తున్నాడు. ఈ భారీ మద్యం విక్రయాల వల్ల తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.36,000 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. సాధారణంగా పట్టణాల్లో మద్యం వినియోగం ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయం ఉన్నప్పటికీ తెలంగాణలో మాత్రం అందుకు భిన్నంగా గ్రామీణ ప్రాంతాల్లోనే వినియోగం అధికంగా ఉంది. పండుగలు, శుభకార్యాలు, సామాజిక వేడుకల్లో మద్యం భాగమైపోవడం దీనికి ప్రధాన కారణంగా విశ్లేషిస్తున్నారు.

## మేడారం స్వస్తిక చిహ్నంపై వివాదం



- తిరగబడిన స్వస్తిక మా ఆదివాసీ ఆచారం
- ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం ఆ గుర్తు సరైనదే
- మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్కసారలమ్మ ఆలయ నిర్మాణంలో ఈ గుర్తును అపసవ్య దిశలో అంటే తిరగవేసి ఏర్పాటు చేయడం చర్చకు దారితీసింది. సామాజిక మాధ్యమాల్లో దీనిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదివాసీ ఆచారాలకు ఉన్న ప్రాముఖ్యతను వివరించింది. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క మంగళవారం మేడారంలో పర్యటించి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్వస్తిక గుర్తుపై జరుగుతున్న ప్రచారాన్ని సీతక్క ఖండించారు. మేడారంలో తిరగబడిన స్వస్తిక గుర్తు విషయంలో ఎవరూ తప్పుడు ప్రచారం చేయవద్దని ఆమె కోరారు. గిరిజన సంప్రదాయాలు లోకరీతికి భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే శతాబ్దాలుగా తమ పూర్వీకుల నుంచి ఈ గుర్తునే పూజిస్తున్నామని స్పష్టం చేశారు. ఇది తరతరాలుగా వస్తున్న ఆచారమని గుర్తు చేస్తూ అందరూ ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. గిరిజన సంస్కృతిలోని వైవిధ్యాన్ని గౌరవించాలని ఈ సందర్భంగా కోరారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న మహాజాతర కోసం ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తోంది. తొలుత వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న మంత్రులు జాతర పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమయం తక్కువగా ఉన్నందున పనుల్లో వేగం పెంచుతూనే నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. రోడ్ల మరమ్మతులు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## జర్నలిస్టుల అక్రెడిటేషన్స్ కొత్త జీ.ఓను సవరించాలి

### టీయుడబ్ల్యుజే డిమాండ్.. 10 వేల కార్డులకు కోతపెట్టేలా కొత్త జీవో

**హైదరాబాద్, మహా :** జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్స్ జారీ చేయడం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీ.ఓ నెంబర్ 252 పై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ జీవో పూర్తి లోపభూయిష్టంగా ఉందని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ కోశాధికారి పి.యోగనంద్, టెంజు ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ లతో కలిసి ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కనీస హక్కు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, జర్నలిస్టుల మధ్య విభేదాలు తెచ్చే విధంగా కొత్త జీ.ఓ ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. అర్హులు అందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలన్న కేసీఆర్ సూచన మేరకు పూర్వ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 23 వేల మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్స్ కార్డ్స్ జారీ చేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా డెస్క్ జర్నలిస్టులను కూడా గుర్తించి ఒకే గొడుగు కిందికి తెచ్చి అందరికీ కార్డులివ్వగా 40 ఏళ్ల నుంచి జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతూ రెండు రాష్ట్రాల్లో ఉండే ఒక సంఘం అప్పట్లో దీనిని వ్యతిరేకించిందని, నేడు వాళ్ళ యూనియన్ కు చెందిన జాతీయ నాయకుడే మీడియా అకాడమీ చైర్మన్ ఉండటంతో ఇప్పుడు డెస్క్ జర్నలిస్టులను వేరు చేసి వాళ్ళ పంతాన్ని నెగ్గించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని డెస్క్ జర్నలిస్టులు నిశితంగా గమనించాలని కోరారు. మీడియా అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు పేరిట రెండు కార్డులు తెచ్చి గందరగోళం సృష్టించారని, ఏ కార్డు వల్ల ఏ ప్రయోజనం జరుగుతుందో జీవోలో విశదీకరించలేదని, జర్నలిస్టులనే వాళ్లకు అందరికీ ఒకే రకమైన ప్రయోజనాలు ఉండాలని డిమాండ్ చేశారు.

**10వేల కార్డులు కోత.. సీఎంకు తప్పుడు సమాచారమిచ్చి జీవో**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు పూర్తవుతున్న నేపథ్యంలో కొత్తగా ఇవ్వబోయే కార్డుల కోసం కొత్త నిబంధనలు పెట్టి కార్డులలో 10 వేలకు పైగా కోత పెట్టె విధంగా ప్రస్తుత నిబంధనలు తెచ్చారన్నారు. ఈ నిబంధనలతో జర్నలిస్టులు తమ హక్కుగా పొందే అక్రెడిటేషన్స్ కార్డులను కోల్పోవడం అనివార్యం అన్నారు. రిపోర్టర్స్, డెస్క్ జర్నలిస్టులకు మధ్య విబేధాలు సృష్టించే విధంగా "మీడియా కార్డును" తేవాలని యోచించడం శోచనీయం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్న సమయంలో తీసుకువచ్చిన జి.ఓ 239 ప్రకారం అప్పటి చైర్మన్ అల్లం నారాయణ కేబుల్ ఛానెల్ లకు రాష్ట్ర స్థాయిలో 12, జిల్లా స్థాయిలో నాలుగు అక్రెడిటేషన్స్ ఇవ్వగా ప్రస్తుత చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కేబుల్ ఛానల్ పై కక్ష కట్టినట్లు రాష్ట్ర స్థాయిలో ఒక్క కార్డు కూడా ఇవ్వకుండా జీవో తేవడం వెనుక మర్మం ఏమిటో అర్థం కావటం లేదన్నారు. మండల స్థాయిలో లక్ష జనాభా పైన ఉంటే గతంలో అదనంగా కార్డులు ఇచ్చేవారని, ప్రస్తుతం కేవలం మండలానికి ఒక కార్డు, నియోజకవర్గానికి అసలు కార్డులే లేకుండా ఎత్తివేయడం వల్ల పార్ట్ టైం రిపోర్టర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రికి ప్రస్తుతం మీడియా అకాడమీ తో పాటు, ఆయన కొనసాగుతున్న సంఘం వారు తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లే ఇలాంటి జీవో వచ్చి ఉంటుందని తాము భావిస్తున్నామని, రాష్ట్రంలోని మెజార్టీ జర్నలిస్టులు వ్యతిరేకించే ఈ జీవోను వెంటనే పునః పరిశీలించి అర్హులైన అందరి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు అందేలా నూతన జీఓను సవరించాలని డిమాండ్ చేశారు. తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, కోశాధికారి యోగానంద్ లు మాట్లాడుతూ ఇండిపెండెంట్ జర్నలిస్టుల కనీస అనుభవం 10 సంవత్సరాలనుండి 15 సంవత్సరాల పెంచడం అన్యాయం అన్నారు. 23 వేల అక్రిడేషన్ కార్డులు ఇస్తే ఇక్కడ అర్హులకు కార్డులు ఇవ్వడం లేదని ఢిల్లీకి పోయి ధర్నా చేసిన ఆ ఆంధ్రా సంఘం నాయకులు ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు.



## కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనపై నిర్లక్ష్యం వహిస్తున్న జిల్లా ఎస్పీని బదిలీ చేయాలని డిమాండ్

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు యాతాకుల రాజన్న మాదిగ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశం ముఖ్య అతిథులుమందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఈ సూర్యాపేట జిల్లాలో గత నెల రోజులుగా కర్ల రాజేష్ లాకప్ డెత్ పై జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అనేకమార్లు కలిసి విన్నవించుకున్న మా దళిత మాదిగ యువకుడి మరణ గోస వాళ్ళ చెవులకు వినిపించడం లేదని జిల్లా ఎస్పీ గారు స్థానిక ఎమ్మెల్యే మాట విని చిలుకూరు ఎస్సై శ్రీనివాస్ రెడ్డిని కేసు నుంచి తప్పిస్తున్నారని వెంటనేదోషులైన పోలీసులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.ఎక్కడలేని విధంగా సూర్యాపేట జిల్లా పోలీసులు రెండు ఎఫైర్లు తప్పుడు రికార్డులను నమోదు చేశారని కర్ల రాజేష్ గాంధీ హాస్పిటల్ లో చనిపోతే అక్కడికి ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఎలా వెళ్తాడని అదే క్రమంలో కోదాడ ఫోటోగ్రాఫర్ రెడ్డిని తీసుకెళ్లారని తప్పుడు రికార్డులతో కేసులు తారుమారు చేసి మా దళిత మాదిగ యువకుడి మరణానికి కారణమైన వారిని వారిపై చర్య తీసుకోకుండా కంటి కంటి తుడుపు గా కోదాడ సిఐ ప్రతాప్ లింగం గారిని సస్పెండ్ చేశారని చిలుకూరు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి పై సస్పెన్షన్ వేటు ఎందుకు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు రాజేష్ మృతికి కారణమైన పోలీసులను దోషుల దోషుల పైన చర్య తీసుకునే అంతవరకు మా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఈనెల 30 న కోదాడ పట్టణ కేంద్రంలో లక్షలాది మందితో బహిరంగ సభ ఉంటుందని పిలుపునిచ్చారు. జిల్లా ఇన్చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ , సమన్వయకర్త చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ,మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హసేన్ ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చింత వినయ్ మాదిగ, ఎం.ఎస్.పి నాయకులు ఎర్ర వీరస్వామి మాదిగ, అడ్వకేట్ దప్పు కు మల్లయ్య, కనుకుంట్లవెంకన్న,ములకలపల్లి రవి మాదిగ వల్దాస్ జానీ జె మాదిగ మందుల శ్రీనివాస్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు. బొల్లద్దు వినయ్, బోయిల్లా అఖిల్ మాల నాయకులు గ్యార కనకయ్య, గంట బిక్షపతి, బొద్దు విజయ్, సిరపంగి లింగస్వామి, మేడి కృష్ణ, చెరుకుపల్లి కిరణ్ మాదిగ, కొండేటి గోపి, మొండి కత్తి గోపీచంద్ మాదిగ మిరియాల చిన్ని మొండి కత్తి మనోజ్, బోరా సునీల్ తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర కేబినెట్‌లో యువగళం

- మోదీ 3.0 మార్క్ సంచలన నిర్ణయాలు
- త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం?
- ఢిల్లీలో పెరగనున్న బెంగాలీ నేతల బలం
- పది ఖాళీలు.. వందల మంది ఆశావహులు
- పనితీరే గీటురాయిగా యువ నేతలకు కీలక పదవులు



**హైదరాబాద్, మహా:** దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, 3.0 ప్రభుత్వంలో పాలనను మరింత వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా యువతను ప్రోత్సహించడం ద్వారా పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కొత్త ఉత్తేజాన్ని నింపాలని ఆయన భావిస్తున్నారు. ప్రభుత్వంలో యువ రక్తాన్ని నింపడం ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నాయకత్వాన్ని సిద్ధం చేయాలని ప్రధాని మోదీ భావిస్తున్నారు. ఇప్పటికే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇదే ఊపును రాబోయే పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని అధిష్టానం గట్టి పట్టుదలతో ఉంది. బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన నేతలకు మరింత ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్రంలో ఆ రాష్ట్రం నుండి ఇద్దరు సహాయ మంత్రులు మాత్రమే ఉండగా, బెంగాల్ ఎన్నికల దృష్ట్యా మరికొందరికి పూర్తి స్థాయి మంత్రి పదవులు ఇచ్చే ఆలోచనలో ప్రధాని ఉన్నట్లు సమాచారం. ఇటీవల 45 ఏళ్ల నితిన్ నబీన్‌ను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించడం ద్వారా పార్టీలో యువతకు ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో మోదీ స్పష్టం చేశారు. అదే తరహాలో ఎలాంటి వివాదాలు లేని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే యువ నేతలను గుర్తించి వారికి కేబినెట్‌లో చోటు కల్పించనున్నారు. స్థిరమైన పనితీరు, సామాజిక మరియు ప్రాంతీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఎంపిక ప్రక్రియ సాగుతోంది. ప్రస్తుత లెక్కల ప్రకారం, కేంద్ర మంత్రివర్గంలో 72 మంది మంత్రులు ఉండగా, నిబంధనల మేరకు గరిష్టంగా 81 మంది వరకు ఉండవచ్చు. అంటే ప్రస్తుతానికి 9 ఖాళీలు ఉన్నాయి. వీటికి తోడు, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఎంపికైన ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తన పదవికి రాజీనామా చేసే అవకాశం ఉండటంతో, ఖాళీల సంఖ్య 10కి చేరనుంది. ఈ పది స్థానాల్లో కొత్త వారికి, ముఖ్యంగా యువతకు అవకాశం కల్పిస్తూ మోదీ తన టీమ్‌ను పునర్వ్యవస్థీకరించనున్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఈ విస్తరణ ప్రక్రియ పూర్తి చేసి, ఆ రాష్ట్ర ప్రజలకు ఒక బలమైన సంకేతం పంపాలని కేంద్రం యోచిస్తోంది. పనితీరే గీటురాయిగా జరగబోయే ఈ మార్పులు దేశ రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తిప్పుతాయో వేచి చూడాలి.

## నకిలీ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి

### బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

**మిర్యాలగూడ మహా:** మిర్యాలగూడలో విచ్చలవిడిగా నకిలీ డాక్టర్లు, డాక్టర్లు గా చలామణి అవుతూ ప్రజల ఆరోగ్యాలతోచెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మిర్యాలగూడలో బీసీ భవన్ లో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ కి నిత్యం చుట్టు పక్క గ్రామాల నుండి అనారోగ్య సమస్యలతో పెద్ద సంఖ్యలో రోగులు మిర్యాలగూడ డాక్టర్లను సంప్రదిస్తూ ఉంటారు ఇది అదునుగా చేసుకొని కొంతమంది నకిలీ డాక్టర్లు ఆర్,ఎంపీ.ల ను అడ్డాగా చేసుకొని పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు ఇలాంటి నకిలీ డాక్టర్లపై వైద్యశాఖ కఠిన చర్యలు తీసుకోవడమే కాక ఐ,ఎం,ఏ కూడా నకిలీ డాక్టర్ల పై నిఘ ఉంచాలని ఆయన అన్నారు కొంతమంది నకిలీ డాక్టర్ల వల్ల నిజమైన వైద్యులకి కూడా చెడ్డ పేరు వస్తుందన్నారు ప్రజల అనారోగ్యాన్ని అదునుగా చేసుకొని టెస్టుల పేరిట పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడమే




కాక కొంతమంది హాస్పిటల్స్ నిర్మించుకొని విసిటింగ్ డాక్టర్లతో వైద్యం చేయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు కాబట్టి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న కొంతమంది నకిలీ డాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ నకిలీ డాక్టర్ల కు అడ్డుకట్ట వేసిన వాళ్ళు అవుతారు కాబట్టి వైద్యశాఖ ఈ నకిలీ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి లేకపోతే మాత్రం మిర్యాలగూడలో పెద్ద ఎత్తున ఆందోళన లు చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దాసరాజు జయరాజ్, మురళి యాదవ్ లు పాల్గొన్నారు

# హైదరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

- మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే
- డిసెంబర్ 24 నుంచి నగరంలో స్పెషల్ డ్రైవ్
- భారీ జరిమానాలు, లైసెన్సుల రద్దుకు నిర్ణయం
- మైనర్లకు వాహనాలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- మీడియా ప్రతినిధులతో సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, ప్రజా భద్రతను మెరుగుపరిచేందుకు సిటీ పోలీసులు కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాన్ని అరికట్టడమే లక్ష్యంగా డిసెంబర్ 24 నుంచి 30వ తేదీ వరకు వారం రోజుల పాటు నగరవ్యాప్తంగా ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు. మంగళవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, రోడ్డు భద్రత అనేది హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడాన్ని ఏమాత్రం సహించబోమని, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మోటార్ వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 185 ప్రకారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి పది వేల రూపాయల జరిమానాతో పాటు ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని సీపీ వివరించారు. ఒకవేళ ఎవరైనా ఒకటి కంటే ఎక్కువ సార్లు పట్టుబడితే వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను కనీసం మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తామని, తీవ్రమైన కేసుల్లో లైసెన్స్‌ను శాశ్వతంగా రద్దు చేసే ప్రక్రియను చేపడతామని తెలిపారు. ప్రమాదాల తీవ్రతను బట్టి నిబంధనలు ఉల్లంఘించే వారి పట్ల రాజీ లేని విధంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. వీటితో పాటు మైనర్ డ్రైవింగ్‌పై కూడా కమిషనర్ తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులు లేదా వారి తల్లిదండ్రులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ పేర్కొన్నారు. నగరవాసులందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రత్యేక తనిఖీల ద్వారా నగరంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడంతో పాటు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలమని పోలీస్ శాఖ ధీమా వ్యక్తం చేస్తోంది.

# కేసీఆర్‌ను ఎదుర్కోలేకనే అక్రమ కేసులు



- దమ్ముంటే సహకార ఎన్నికలు పెట్టండి
- ఓటమి భయంతోనే ఎన్నికల నుంచి కాంగ్రెస్ పరారీ
- కేసులకు భయపడం.. రైతుల కోసం పోరాటం ఆపం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మహా:** అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకనే కేసీఆర్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే వెంటనే సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. నల్గొండ జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా లేకనే ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆయన ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేస్తే, మిగిలిన 10 శాతం పనులను ఈ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని కేటీఆర్ మండిపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేసీఆర్ గట్టిగా గర్జిస్తుంటే, దాన్ని తట్టుకోలేకనే ప్రభుత్వం తప్పుడు లీకులు ఇస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని మంత్రులకు సాగునీటి రంగంపై కనీస అవగాహన లేదని, కేవలం అబద్ధాలతోనే కాలం వెళ్లదీస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రైతులకు నిజంగా మంచి చేశామని ప్రభుత్వానికి నమ్మకం ఉంటే, నామినేటెడ్ పద్ధతిలో కాకుండా వెంటనే సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కూడా వాయిదా వేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రైతు బంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు భరోసా వంటి హామీలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని, ఇచ్చిన '420' హామీలను అమలు చేయలేక ప్రజలకు ముఖం చూపలేకపోతున్నారని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లోనే ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టమైందని, రైతులకు అవకాశం చిక్కితే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అర్జునుడి లక్ష్యంలాగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని, రైతాంగానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ప్రకటించారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్ గారిపై నిందలు వేస్తున్నారని, కానీ వాస్తవాలను ఎవరూ దాచలేరని అన్నారు. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, ప్రజాక్షేత్రంలోనే అన్ని విషయాలను తేల్చుకుంటామని కేటీఆర్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## కస్తూరి బా గాంధీ విద్యాలయం లో పిల్లలకు-జిల్లా బాలల పరిరక్షణ విభాగం అవగాహన కార్యక్రమం



**హుజూర్ నగర్ మహా:** మఠంపల్లి మండలం వెంకట్రామపురం గ్రామం,కస్తూరి బా గాంధీ విద్యాలయం నందు బాల రక్ష భవన్ - సూర్యాపేట జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లల చట్టాలు మరియు వారి సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ షేక్ నాగుల్ మీరా మాట్లాడుతూ ఈ రోజుల్లో ప్రతి విద్యార్థి ఆలోచనా విధానంలో మార్పు రావాలని, భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యంతో చదువుకోవాలని, ప్రతి విద్యార్థి సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా తమ భవిష్యత్తు కార్యచరణను సిద్ధం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు మన మీద పెట్టుకున్న ఆశలు నమ్మకాన్ని మన చదువు మరియు విజయాలతో నిలబెట్టాలన్నారు.పిల్లలు బాగా చదివి మంచి పేరు తేవడం ద్వారా మాత్రమే తల్లిదండ్రులపై ఉన్న బాధ్యతను తీరుస్తామని వివరించారు. బాలల పరిరక్షణ విభాగ వి.వి. శ్రీలక్ష్మి మాట్లాడుతూ పిల్లల హక్కులు, వారి బాధ్యతలు గురించి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ పేరుతో పిల్లలు ఎలా మోసపోతున్నారో కొన్ని ఉదాహరణలు చెబుతూ, పాఠశాల దశలోనే విద్యార్థులు తమ ప్రవర్తన, ఆలోచన విధానాన్ని మార్చుకుని జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.భవిష్యత్తు, సమాజం, తల్లిదండ్రుల పరిస్థితులు, ప్రస్తుత కాల ప్రభావాలకు లోనూ కాకుండా అర్థం చేసుకుని ముందుకు సాగాలని వివరించారు. నిరుపేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలు తల్లిదండ్రుల ప్రేమను గౌరవించి, అన్ని విషయాల్లో పరిజ్ఞానం పెంపొందించుకుని పాఠశాలకు మంచి పేరు తెచ్చించాలని , చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. పాఠశాల మరియు కళాశాల ప్రధానోపాధ్యాయులు వి.విజయకుమారి మాట్లాడుతూ పాఠశాల దశలో తీసుకునే నిర్ణయాలు జీవితానికి పునాది వంటివని, మంచి స్నేహాలను మాత్రమే ఎంచుకోవాలని, చెడు స్నేహితులను దూరంగా ఉంచాలని, పెద్దల పట్ల గౌరవం, విధేయతతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సాయి త్రిలోక్, వంశీ మరియు పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

## మదర్సా టీచర్లకు రక్షణ కవచం తొలగింపు

- యోగి సర్కార్ సంచలన నిర్ణయం
- మదర్సాల్లో అక్రమాలపై ఇక పోలీసుల నేరుగా చర్యలు

**హైదరాబాద్, మహా:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాష్ట్రంలో మరో సంచలన నిర్ణయాన్ని అమలులోకి తెచ్చారు. గత సమాజ్ వాదీ పార్టీ ప్రభుత్వ హయాంలో మదర్సా ఉపాధ్యాయులకు, సిబ్బందికి కల్పించిన ప్రత్యేక చట్టబద్ధమైన రక్షణను రద్దు చేస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2016లో అప్పటి ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ హయాంలో తీసుకువచ్చిన ఈ చట్టం ప్రకారం, మదర్సా సిబ్బందిపై ఎలాంటి ఆర్థిక అక్రమాలు లేదా నేరారోపణలు వచ్చినా పోలీసులు నేరుగా చర్యలు తీసుకునే అవకాశం ఉండేది కాదు. వారిపై దర్యాప్తు చేయాలన్నా లేదా అరెస్ట్ చేయాలన్నా ప్రత్యేక అనుమతులు తీసుకోవడం తప్పనిసరిగా ఉండేది. ఈ నిబంధన మదర్సా సిబ్బందికి ఒక రకమైన రక్షణ కవచంలా పనిచేస్తూ వచ్చింది. అయితే, ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకుని మదర్సా విద్యాసంస్థల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, జవాబుదారీతనం లోపించిందని యోగి ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే పాత చట్టాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజా సవరణతో, మదర్సా సిబ్బందిపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా లేదా అక్రమాలకు సంబంధించిన ఆధారాలు దొరికినా పోలీసులు ఇకపై ఎవరి అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం లేదు. సాధారణ నిబంధనల ప్రకారమే నేరుగా దర్యాప్తు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకునే పూర్తి అధికారం పోలీసులకు లభించింది. ఈ నిర్ణయాన్ని సమర్థిస్తూ 'చట్టానికి ఎవరూ అతీతం కాదు' అనే సూత్రాన్ని ప్రభుత్వం నొక్కి చెప్పింది. మదర్సాల్లో పారదర్శకతను పెంచడం, విద్యా వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడం మరియు వ్యవస్థను మరింత జవాబుదారీగా మార్చడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని యోగి సర్కార్ స్పష్టం చేసింది. ఈ మార్పు ద్వారా మదర్సా విద్యాసంస్థల్లో పాలన మెరుగుపడుతుందని, సామాన్య ప్రజల మాదిరిగానే అందరూ చట్టానికి లోబడి ఉండాలనే సందేశాన్ని ఈ నిర్ణయం ఇస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# నా కెరీర్ నాశనం చేశారా?

- సెంచరీ చేసినా ఛాన్స్ ఇవ్వలేదు
- ధోనీ నిర్ణయం వెనుక మర్మమేంటి?
- ధోనీపై మనోజ్ తివారీ సంచలన వ్యాఖ్యలు




**హైదరాబాద్, మహా:** భారత క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరుగాంచిన మహేంద్ర సింగ్ ధోనీపై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తాజాగా చేసిన వ్యాఖ్యలు క్రీడా వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. తన కెరీర్ ఆరంభంలో అద్భుత ఫామ్‌లో ఉన్నప్పటికీ, జట్టులో సరైన అవకాశాలు రాకపోవడానికి ధోనీ తీసుకున్న నిర్ణయాలే కారణమని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా 2011లో వెస్టిండీస్‌పై సెంచరీ చేసిన తర్వాత కూడా తనను తర్వాతి 14 మ్యాచుల వరకు రిజర్వ్ బెంచ్‌కే పరిమితం చేయడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ సమయంలో తాను కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నానని, కానీ కెప్టెన్ నుంచి తనకు లభించిన ప్రోత్సాహం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదని ఆయన వాపోయారు. రిటైర్మెంట్ తర్వాత తన మనసులోని ఆవేదనను వెలిగక్కుతూ, ఆ రోజుల్లో ధోనీని నేరుగా అడగాలని అనుకున్నానని, కానీ అప్పట్లో ఉన్న పరిస్థితుల దృష్ట్యా మౌనంగా ఉండిపోవాల్సి వచ్చిందని మనోజ్ తివారీ పేర్కొన్నారు. ఒక ఆటగాడు సెంచరీ చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న తర్వాత కూడా జట్టుకు దూరం కావడం ఏ క్రీడాకారునికైనా జీర్ణించుకోలేని విషయమని ఆయన గుర్తు చేశారు. ఈ నిర్ణయం తన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే కాకుండా, టీమిండియాలో తన భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజకీయాల్లో రాణిస్తున్నప్పటికీ, క్రికెట్ మైదానంలో ఎదురైన ఆ చేదు అనుభవం మాత్రం తనను ఇప్పటికీ వెంటాడుతూనే ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ధోనీ వంటి దిగ్గజ కెప్టెన్ హయాంలో చాలా మంది ఆటగాళ్లు వెలుగులోకి వచ్చినప్పటికీ, మనోజ్ తివారీ వంటి ప్రతిభావంతులు మాత్రం తగిన గుర్తింపు పొందలేకపోయారనే చర్చ మళ్లీ మొదలైంది. సోషల్ మీడియా వేదికగా ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ధోనీ వ్యూహాలను సమర్థిస్తుండగా, మరికొందరు మాత్రం తివారీకి అన్యాయం జరిగిందని అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద మనోజ్ తివారీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారాయి.

# తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు భారీ శుభవార్త

### 71,387 మందికి డీఏ ప్రయోజనం.. డీఏ పెంపు దస్త్రంపై డిప్యూటీ సీఎం సంతకం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పింఛన్‌దారులకు 17.651 శాతం డీఏ ఖరారు చేస్తూ అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఎంతో కాలంగా కరువు భత్యం కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగ వర్గాలకు ఈ ప్రకటనతో పెద్ద ఊరట లభించింది. విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఈ డీఏ పెంపు ప్రతిపాదనలకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ధరల సూచీని పరిగణనలోకి తీసుకుని, ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో చేసే సమీక్షలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సంవత్సరం జూలై 1, 2025 నుంచి ఈ పెంపు అమలులోకి రానుంది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మొత్తం 71,387 మంది ఉద్యోగులు, ఆర్టిజన్లు మరియు పెన్షనర్లకు ప్రత్యక్ష లబ్ధి చేకూరనుంది. డీఏ పెంపు కారణంగా విద్యుత్ సంస్థలపై ప్రతి నెలా సుమారు 9.39 కోట్ల రూపాయల అదనపు ఆర్థిక భారం పడనుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ ట్రాన్స్‌కో పరిధిలో 3,036 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 3,769 మంది ఆర్టిజన్లు, 2,446 మంది పింఛన్‌దారులతో కలిపి మొత్తం 9,251 మందికి ప్రయోజనం కలగనుంది. అలాగే తెలంగాణ జెన్‌కోలో 6,913 మంది ఉద్యోగులు, 3,583 మంది ఆర్టిజన్లు, 3,579 మంది పెన్షనర్లు ఈ కొత్త డీఏను పొందనున్నారు. పంపిణీ సంస్థలైన ఎస్పీడీసీఎల్ మరియు ఎన్పీడీసీఎల్ పరిధిలో కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 11,957 మంది ఉద్యోగులు, 8,244 మంది ఆర్టిజన్లు, 8,244 మంది పింఛన్‌దారులకు ఈ పెంపు వర్తించనుంది. ఎన్పీడీసీఎల్ పరిధిలో 9,728 మంది ఉద్యోగులు, 3,465 మంది ఆర్టిజన్లు మరియు 6,115 మంది పింఛన్‌దారులు ఆర్థికంగా లాభపడనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరియు ఉద్యోగుల సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యుత్ శాఖా ఉద్యోగుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పెరిగిన డీఏ ద్వారా ఉద్యోగుల మరియు వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు




బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో హిందూ యువకుడి పై మూకదాడి చేసి దారుణంగా హతమార్చిన ఘటన తీవ్ర రాజకీయ, దౌత్య ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఈ హత్యపై భారత్ అంతటా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హిందూ సంఘాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ తదితర హిందూ సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున హైకమిషన్ ఎదుట ఆందోళనకు దిగారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న వరుస దాడులు, దేవాలయాల విధ్వంసం, మతపరమైన హింసను ఖండిస్తూ నినాదాలు చేశారు. నిరసనకారులు హైకమిషన్ లోపలికి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు భారీ బందోబస్తుతో వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొనగా, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. హైకమిషన్ పరిసరాలను పూర్తిగా భద్రతా వలయంలోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకమిషన్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై వివరణ ఇవ్వాలని బంగ్లాదేశ్ రాయబారికి భారత విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. మతపరమైన మైనారిటీల భద్రతను నిర్ధారించాల్సిన బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. గత వారం బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ ప్రాంతంలో హిందువు అయిన దీపు చంద్ర దాస్ను ఇస్లామిక్ మూక అత్యంత క్రూరంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై భారత్ ఇప్పటికే అధికారికంగా నిరసన తెలుపుతూ, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. అయినప్పటికీ, హిందువులపై దాడులు కొనసాగుతుండటంతో ఆగ్రహం మరింత ముదిరింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హింసను అంతర్జాతీయ స్థాయిలో లేవనెత్తాలని, మానవ హక్కుల సంస్థలు జోక్యం చేసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాలు భారత్-బంగ్లాదేశ్ మధ్య దౌత్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశముంది. భారత్-బంగ్లాదేశ్ మధ్య దౌత్య సంబంధాలపై తాజా పరిణామాలు గణనీయమైన ప్రభావం చూపే అవకాశముంది. పొరుగు దేశాలుగా ఇరు దేశాలకు చారిత్రక, రాజకీయ, ఆర్థిక సహకారం ఉన్నప్పటికీ, బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాల్లో సున్నిత అంశంగా మారుతున్నాయి. భారత్ ఇప్పటికే ఈ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, మైనారిటీల భద్రతను నిర్ధారించాల్సిన బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. అవసరమైతే అంతర్జాతీయ వేదికలపై కూడా ఈ అంశాన్ని లేవనెత్తే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇది భవిష్యత్తులో రాజకీయ సంభాషణలు, వాణిజ్య ఒప్పందాలు, భద్రతా సహకారంపై ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో మతపరమైన హింసను అరికట్టడంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం తీసుకునే చర్యలే కీలకంగా మారనున్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురాకపోతే, భారత్-బంగ్లాదేశ్ మధ్య విశ్వాసం దెబ్బతిని, దౌత్య సంబంధాల్లో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

# స్టార్ లింక్‌కు రష్యా ముప్పు



అంతరిక్షంలో సరికొత్త సంచలనాలు.. ఉపగ్రహాలకు కొత్త ముప్పును సూచిస్తున్నాయి. టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహాలే లక్ష్యంగా రష్యా సరికొత్త ఆయుధాన్ని తయారు చేస్తున్నట్టు నాటోకు చెందిన రెండు నిఘా సంస్థలు అంచనా వేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. కక్ష్యలోనే ఈ ఉపగ్రహాలను పేల్చే విధంగా సరికొత్త యాంటీ-శాటిలైట్ ఆయుధాన్ని అభివృద్ధి చేస్తోందని పశ్చిమ దేశాల నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. దీనికి సంబంధించి 'అసోసియేటెడ్ ప్రెస్' వెల్లడించిన నివేదిక అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. లక్షలాది లోహపు గుళికలతో ఒకేసారి అధిక సంఖ్యలో ఉపగ్రహాలను ధ్వంసం చేసేలా ఓ ఆయుధాన్ని రష్యా రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యుద్ధంలో ఉక్రెయిన్ నిలదొక్కుకునేందుకు స్టార్‌లింక్ ఉపగ్రహాలే కారణమని రష్యా భావించి ఈ ఆయుధాన్ని తయారు చేస్తున్నట్టు పాశ్చాత్య దేశాలు భావిస్తున్నాయి. ఈ సందేహాలు నిజమైతే మాత్రం అంతరిక్ష రంగానికి పెను ముప్పు పొంచి ఉందని హెచ్చరిస్తున్నాయి. సాధారణంగా ఒక క్షిపణి ఒక ఉపగ్రహాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుంది. కానీ రష్యా రూపొందిస్తున్న కొత్త ఆయుధం 'జోన్-ఎఫెక్ట్' పూర్తి భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ ఆయుధాన్ని ప్రయోగిస్తే కక్ష్యలోకి లక్షలాది చిన్నపాటి, అత్యంత సాంద్రత కలిగిన లోహపు గుళికలను విడుదల చేస్తుందని సమాచారం. ఈ గుళికలు అంతరిక్షంలో ఒక మేఘంలా వ్యాపించి, ఆ మార్గంలో ప్రయాణించే వందలాది స్టార్‌లింక్ ఉపగ్రహాలను ఏకకాలంలో దెబ్బతీస్తాయని నాటో నిఘా సంస్థలు భావిస్తున్నాయి. ఈ పెల్లెట్లు చాలా చిన్నగా, మిల్లీమీటర్ పరిమాణంలో మాత్రమే ఉంటాయని నిఘా వర్గాల అధ్యయనంలో తేలింది. వీటిని భూమ్మీద గానీ, అంతరిక్షంలో గానీ గుర్తించడం కష్టతరమని పేర్కొన్నాయి. వీటిని ట్రాక్ చేసే అవకాశం లేకపోవడంతో ముప్పును ముందే పసిగట్టలేమని అంచనా వేశాయి. అయితే, వీటితో ప్రమాదం మాత్రం తీవ్రంగానే ఉంటుందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఇలాంటి చిన్న పరిమాణంలో ఉండే శకలం కారణంగా ఇటీవల చైనాకు చెందిన ఓ వ్యోమనౌక దెబ్బతింది. ఫలితంగా భూమ్మీదకు రావాల్సిన ముగ్గురు వ్యోమగాములు సైతం అంతరిక్షంలోనే చిక్కుకుపోయారు. ఉక్రెయిన్ యుద్ధంలో స్టార్‌లింక్ ఒక 'వెన్నెముక'లా పనిచేస్తోంది. రష్యా దాడుల వల్ల భూతల ఇంటర్నెట్ వ్యవస్థలు దెబ్బతిన్నా, స్టార్‌లింక్ ద్వారా ఉక్రెయిన్ తమ కమ్యూనికేషన్‌ను కాపాడుకోగలుగుతోంది. రష్యా ఒకవేళ 'జోన్-ఎఫెక్ట్' ఆయుధాన్ని వాడితే అతి కెస్లర్ సిండ్రోమ్ ముప్పునకు దారి తీయొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రష్యా ఈ ఆయుధాన్ని ప్రయోగిస్తే అది కేవలం స్టార్‌లింక్‌కే కాకుండా మొత్తం అంతరిక్ష రంగానికే ముప్పుగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. రష్యా, చైనా ఉపగ్రహాలకు కూడా ముప్పు కలుగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో పాటు చైనా స్పేస్ స్టేషన్‌కు కూడా ప్రమాదమని హెచ్చరించారు. ఎర్త్ లోవర్ ఆర్బిట్‌లో లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉన్న ఎస్-500 క్షిపణి వ్యవస్థను తాము మోహరించినట్లు ఇప్పటికే రష్యా ప్రకటించింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలం నాటి ఉపగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు 2021లో రష్యా ఓ క్షిపణిని సైతం ప్రయోగించింది. ఈ నేపథ్యంలో రష్యా కొత్త ఆయుధాన్ని తయారు చేస్తున్నట్టు కొన్ని పశ్చిమ దేశాలు భావిస్తుండగా మరికొన్ని దేశాలు ఆ ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నాయి. మరి అసలు నిజాలేంటో ప్రపంచానికి ముందుముందు తెలుస్తుంది. రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా ఉక్రెయిన్ కు సహకరించే ఎవరినీ వదిలిపెట్టడం లేదు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:

mahaapatrika@gmail.com

whatsapp-

74369 39999



# స్కానింగ్ సెంటర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయండి

రాష్ట్ర వ్యాప్తంగా స్కానింగ్ సెంటర్లు, వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించే ల్యాబ్ లు అమాయక ప్రజలను నిట్ట నిలువునా ముంచుతూ కోట్లాది రూపాయలను సంపాదిస్తూ బహిరంగ దోపిడీ చేస్తూ వున్నారు. మన రాష్ట్రం లోని నగరాలలో,పట్టణాలు,మండలాలలో వీరి అవినీతి కి అడ్డు అదుపు లేదు. వివిధ సీజన్ లలో ప్రజలు ముఖ్యంగా మలేరియా,డెంగీ,టైఫాయిడ్, తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పేరు పొందిన జనరల్ మెడిసిన్ యం. డి డాక్టర్ లను ఆశ్రయించడంతో ప్రతీ వైద్యుడు ఆ రోగిని పరీక్షించి అన్ని రకాల పరీక్షలు చేయాలని తమకు అనుకూలంగా వున్న ప్రైవేట్ ల్యాబులకి పంపుతున్నారు. ఇదే అదనుగా భావించి నిబంధనలకు విరుద్ధంగా అధికంగా డబ్బులు వసూలు చేస్తూ అటు డాక్టర్లకు తమ తమ ల్యాబు ల నుండి కమీషన్ పొందుతూ వున్నారు. పరీక్షలు లో ఎలాంటి వ్యాధి లక్షణాలు లేకున్న కనీసం అయిదు వందల నుండి రెండు వేల రూపాయల మందులు రాస్తూ అటు మెడికల్ షాపులలో ఆదాయాన్ని కూడా పొందుతూ వున్నారు. కొన్ని ల్యాబ్ లలో వివిధ పరీక్షలు నిర్వహిస్తే రక్త కణాలు ప్లేట్ లెట్స్ సంఖ్య తక్కువగా ఉన్నట్లు మరికొన్ని పెద్ద ఆసుపత్రులలో పరీక్షలు చేపిస్తే రక్త కణాలు అధికం గా వున్నట్లు ల్యాబ్ రిపోర్టులు వస్తూ వున్నాయి.ఆయా ల్యాబ్ లలో వానిని చూసి నిర్ధారించే పాథాలజీ డాక్టర్లు,మరియు ల్యాబ్ టెక్నీషియన్ లు ప్రామాణికం గా నిర్ధారణ చేయకుండానే రిపోర్టులు ఇస్తూ వున్నారనే ఆరోపణలు విన వస్తూ వున్నాయి. సర్కారు ఆదేశాలను తుంగలో తొక్కి వారు రోగుల్లో భయాన్ని కల్గిస్తూ అక్రమంగా అందిన కాడికి దోచుకుంటూ ఉన్నారు. అవసరం లేకున్నా డాక్టర్లు స్కానింగ్ తప్పని సరని రోగులను కోరుతూ బలవంతం గా చేయిస్తూ వున్నారు. కొందరు వైద్యులు స్కానింగ్,ల్యాబ్ నిర్వాహకులు వైద్యాన్ని వ్యాపారంగా మార్చేశారు. స్వల్పంగా దగ్గు, జలుబు, జ్వరం ఉంటే చాలు అవసరం లేకుండా సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా సామాన్యుల జేబు చిల్లు పడుతుంది. అయితే ఇది ఈ దోపిడీ పర్వం పై ప్రజల ఇబ్బందుల పై గతంలో అధికారులుస్కానింగ్ సెంటర్ నిర్వాహకులతో చర్చలు జరిపి తక్కువ చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ ఆదేశాలనుసైతం తుంగలో తొక్కుతున్నారు.నియమ నిబంధనలనుసైతం పెడచెవినపెడుతూ స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్ లను నిర్వహిస్తున్నారు. రాష్ట్రం లోని ప్రముఖ స్కాన్ సెంటర్ లలో,ల్యాబ్ లలో అడ్డగోలు బిల్లులను తీసుకుంటూ ఆర్థిక దోపిడీకి తెగబడుతున్నారు. కనీసం రిసిప్ట్ కూడా ఇవ్వకుండా ముక్కుపిండి మరీ బిల్లులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తూ వున్నాయి.. కోట్లాది రూపాయలు సంపాదిస్తూ అటు ప్రభుత్వం ఇటు ప్రజలను అధికారులను మోసం చేస్తున్న స్కానింగ్ సెంటర్లపై అధికారుల పర్యవేక్షణ లోపం తూతూ మంత్రంగా కనబడుతుంది. ఇక సంబంధిత అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో అలవాటుపడి ఎవరికీ ఏ మైతే తమకేంటి, తమజేబులు నిండితే చాలు అన్నట్లుగా వ్యవహరిస్తుండడం అత్యంత దారుణమైన సిగ్గుచేటు చర్యగా ప్రజలు అభివర్ణిస్తున్నారు.తెలుగు రాష్ట్రా లలో అన్ని జిల్లాలలో,పట్టణ కేంద్రాలలో వున్న స్కానింగ్ సెంటర్స్,ప్రైవేట్ ల్యాబ్ లలో జరుగుతూ వున్న ఈ మోసాన్ని ప్రభుత్వము, సంబంధిత అధికారులు దాడులు నిర్వహించి ఈ వ్యాపారం కి అడ్డు కట్ట వేయాల్సిన భాధ్యత ఎందగానో వుంది.

**- కామిడి సతీశ్ రెడ్డి,**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, 9848445134.**

## సింగరేణి మాజీ ఉద్యోగుల పెన్షన్ పట్ల

# ఎందుకీ వివక్ష?



భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశం. సమాన హక్కులు, సమాన అవకాశాలు ప్రతి పౌరుడికి కల్పించాలన్నదే భారత రాజ్యాంగ సారాంశం. అయితే...సింగరేణి బొగ్గుగనుల్లో భూగర్భంలో పని చేసి, దేశానికి వెలుగులు నింపిన కార్మికుల విషయంలో ఈ రాజ్యాంగ ఆత్మ ఎక్కడ కనిపించటం లేదు? దేశానికి వెలుగులు నింపిన కార్మికులకు ముసలితనంలో చీకటి జీవితం అనుభవించాల్సివస్తోంది. దేశ రక్షణలో సైనికులు, ప్రభుత్వ సేవల్లో ఉద్యోగులు, రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, వీరందరికీ పదవీ విరమణ అనంతరం పెరుగుతూ ఉండే పెన్షన్, కానీ సింగరేణి మాజీ ఉద్యోగులకు మాత్రం చాలీచాలని, పెరుగుదల లేని పెన్షన్, వెయ్యి... రెండు వేల రూపాయల పెన్షన్‌తో జీవించాలా?ఈరోజు మార్కెట్ ధరలు ఎలా ఉన్నాయి? నిత్యావసర వస్తువులు, వైద్యం, కరెంట్, నీరు, ఇవన్నీ కలిపి చూస్తే వెయ్యి లేదా రెండు వేల రూపాయల పెన్షన్‌తో జీవితం సాధ్యమా? ఒకనాడు భూగర్భంలో ప్రమాదాల మధ్య పనిచేసి ఆరోగ్యాన్ని కోల్పోయి శరీర అవయవాలను త్యాగం చేసి, సుమారు 30-40 సంవత్సరాల పాటు సింగరేణికి సేవలందించిన కార్మికులు ఈరోజు ముసలితనంలో సీనియర్ సిటిజన్ హోదాలో కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సిన దుస్థితిలో జీవిస్తున్నారు. రాజకీయ నాయకులకు ఎన్నిసార్లు గెలిస్తే అన్నిసార్లు పెన్షన్. ఒక ప్రజాప్రతినిధి ఒకసారి ఎమ్మెల్యే అయితే పెన్షన్, రెండోసారి గెలిస్తే మరో పెన్షన్, మూడోసారి గెలిస్తే మరింత పెన్షన్ అయితే... దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలిచిన సింగరేణి కార్మికులకు మాత్రం ఒక్క పెన్షన్ కూడా గౌరవప్రదంగా ఎందుకు లేదు? సింగరేణి ప్రాంత ప్రజాప్రతినిధుల వద్ద రిటైర్డ్ ఉద్యోగుల వినతిపత్రాలు, సంఘాల విజ్ఞప్తులు అనేకం మూలుగుతున్నాయి. అన్నీ "చూద్దాం...చేస్తాం..." అనే మాటలకే పరిమితమవుతున్నాయి. ఇకనైనా పాలకులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరవాలి. గౌరవప్రదమైన జీవితం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దేశానికి సేవ చేసిన ప్రతి ఉద్యోగికి జీవన వ్యయాలకు సరిపోయే పెన్షన్, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెరుగుదల, వైద్య భద్రత ఇవన్నీ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. నిన్నటి సింగరేణి కార్మికుడు ఈరోజు నిర్లక్ష్యానికి గురైతే రేపటి యువతకు ఉద్యోగాలపై నమ్మకం ఎలా ఉంటుంది? దేశానికి వెలుగులు నింపిన చేతులకు ముసలితనంలో చీకటి జీవితం న్యాయమా?

**- కురి రాజేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగి**
**మణుగూరు , కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

# మల్లక్కపేట ఆలయంలో మాలల టెండర్

**రూ.8.23 లక్షలకు పలికిన టెండర్**



**పరకాల, మహా:** పరకాల మండలం మల్లక్కపేట శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం మాలల టెండర్‌ను ఆలయ ఈవో వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టెండర్ ఈ ఏడాది గత ఏడాదితో పోలిస్తే రూ.1.43 లక్షలు అధికంగా పలికినట్లు ఈవో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అంభీరు మహేందర్ మాట్లాడుతూ, గత సంవత్సరం రూ.6.80 లక్షలకు టెండర్ దక్కగా, ఈసారి రూ.8.23 లక్షలకు పలికిందని తెలిపారు. భక్తుల సంఖ్య పెరగడం వల్లే టెండర్ మొత్తం పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కాటూరి జగన్నాథచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బల్దియాలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- పారిశుద్ధ్య సిబ్బంది శ్రేయస్సుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి
- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి కార్మికులకు స్వెట్టర్ లు పంపిణీ చేసిన మేయర్




**వరంగల్ మహా;** పారిశుద్ధ్య సిబ్బంది శ్రేయస్సు కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని నగర మేయర్ గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. మంగళ వారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో పారిశుధ్య సిబ్బందికి స్వెట్టర్ల అందజేత కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని పారిశుధ్య సిబ్బందికి స్వెట్టర్లను అందజేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, చలి కాలం లో రక్షణ కోసం ప్రతి సంవత్సరం స్వెట్టర్ లను అందజేస్తున్నామని అన్నారు. అంతే కాకుండా సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రైవేట్ ఆసుపత్రుల సమన్వయం తో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి సాధారణ పరీక్షల తో పాటు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకొంటున్నామని అన్నారు. వర్షాకాలం లో రెయిన్ కోట్ లతో పాటు వేసవి కాలం లో క్యాప్ లను చలి కాలం లో స్వెట్టర్లను అందజేస్తున్నామని అన్నారు. పారిశుధ్య సిబ్బంది వ్యక్తిగత రక్షణకు పి పి ఈ కిట్ లను కూడా అందజేస్తున్నామని ఈ సందర్భం గా మేయర్ తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కేక్ ను మేయర్, కమిషనర్ లు సంయుక్తం గా కట్ చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి ఎం హెచ్ ఓ డా.రాజేష్ సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్, గోల్కొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి మార్గదర్శకం

**క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు.. రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**




జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ

**వరంగల్, మహా;** ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి మార్గదర్శకమని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఓ సీటీ లోని మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై నగర మేయర్, వరంగల్ జిల్లా కలెక్టర్, మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పాస్టర్ లతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేయడం తో పాటు, తూర్పు నియోజకవర్గంలోని పాస్టర్ లందరికీ మంత్రి తన సొంత ఖర్చుతో దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. మొదట రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రిస్మస్ సందర్భంగా జిల్లాలోని చర్చ్ ల పెయింటింగ్స్, లైటింగ్ కొరకు చర్చ్ కు రూ.30 వేల చొప్పున రూ 45 లక్షలు కేటాయించడం పట్ల మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలు ప్రేమ దయ కరుణలకు చిహ్నంగా నిలుస్తాయని క్రైస్తవులందరూ ఎంతో గొప్పగా జరుపుకుంటారని అన్నారు. ప్రేమ సహనం, శాంతి, క్షమ ఈ నాలుగు గుణాలే క్రీస్తు చూపిన మార్గాలని, దీనిని అనుసరించడం ద్వారా క్రీస్తు పట్ల మనం చూపే నిజమైన భక్తి అని ఏసుక్రీస్తు యావత్ మానవాళిని పాపాల నుండి విముక్తి చేయడానికి తాను శిలువ ఎత్తారని, రక్తాన్ని చిందించి మనుషుల పాపాలను దోషాలను ప్రక్షాళన చేశారని, శాంతి క్షమల సందేశాన్ని తన త్యాగంతో యేసు చాటి చెప్పారని తన మహిమను ప్రకటించి లోకంలోని పాపాన్ని తొలగించడం కోసం మనుషులకు బదులుగా తాను శిక్షను అనుభవించాడని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్లు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి కొండా సురేఖతో పాటు మేయర్ జిల్లా కలెక్టర్, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పాల్గొని ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు. తెలియజేశారు. నగర మేయర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకలను ఇదే వేదికలో వేడుకలు నిర్వహించుకోవడం సంతోషం గా ఉంటుందని స్వంత ఖర్చుల తో కొండా దంపతులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

ఏసు క్రీస్తు అనగానే కరుణ, దయ అనే రెండు పదాలు ఎప్పుడూ గుర్తుకు వస్తాయని, దేవుని సంపూర్ణ హృదయంతో ఆత్మతో ప్రేమించాలని అలాగే పొరుగు వారిని కూడా మనలాగే ప్రేమించాలని ఆయన సందేశంలో పేర్కొన్నారని కలెక్టర్ తెలిపారు. మనతో పాటు నలుగురికి సహాయం చేద్దామనే ఆలోచన గొప్ప విషయమని, కొండా దంపతులు సుమారు 250 మంది పాస్టర్లకు సూట్లను అందజేయడం గొప్ప విషయమని, సమాజం నుండి తీసుకోవడమే కాకుండా నేడు ఇవ్వడం కూడా చూస్తున్నామని తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, ఆదనవు కలెక్టర్. సంధ్యారాణి, ఆర్డీఓ సుమ, కార్పొరేటర్లు భోగి సువర్ణ, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, పోశాల పద్మ, మరుపల్ల రవి, బాల్నే సురేష్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, ఫుర్ఖాన్, క్రైస్తవ సోదర సోదరిమణులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్దే లక్ష్యంగా పనిచేయాలి:చల్లా ధర్మారెడ్డి



**పరకాల మహా:** కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామాభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఇటీవలే జరిగిన సర్పంచి ఎన్నికల్లో గెలుపొందిన నడికుడ మండలం పులిగిల్ల,వరికోల్, నర్సక్కపల్లి గ్రామాలకు చెందిన సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ని హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి పూల బొకే అందచేసి మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఎన్నికలవరకే పార్టీలని,తర్వాత పాలకవర్గ సభ్యులందరూ కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్దే లక్ష్యంగా కృషిచేయాలన్నారు. మీపై ప్రాల్లో ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్,ఉప సర్పంచులు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు బోధనలు సమస్త మానవాళికి మార్గదర్శకం

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్ మహా :** ఏసుక్రీస్తు బోధనలు సమస్త మానవాళికి మార్గదర్శకం అని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లక్ష్మీ గార్డెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి క్రైస్తవ మత పెద్దలు ఫాదర్లు ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని మతాలకు సమాన ప్రాధాన్యమిస్తున్నదని తెలిపారు.. హుస్నాబాద్ లో క్రైస్తవ కమ్యూనిటీ హాల్ కి స్థలం చూపించి భవన నిర్మాణానికి 25 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఏసుప్రభు ఆదర్శాలను గౌరవించడానికి క్రిస్మస్ సంతోషకరమైన పండుగని సందర్భమని పేర్కొన్నారు ప్రేమ సహనం త్యాగం దాతృత్వమనే సుగుణాల ఆచరణ ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించిన యేసుక్రీస్తు జీవనం అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి అయి కాలువలతో హుస్నాబాద్ సస్య శ్యామలం అవుతుందని, మెడికల్ పరంగా పీజీ హాస్పిటల్ తో విద్య, వైద్య, ఉపాధి అవకాశాల్లో మరింత ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్ లు , ఫాస్టర్ లు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.



# ఆధునీకరణ అదుర్స్

- కరీంనగర్ టూ టౌన్ కు హైటెక్ హంగులు
- మహిళ సిబ్బందికి ప్రత్యేక వసతి విశ్రాంతి గది ఏర్పాటు..
- సీ పీ ప్రత్యేక చొరవతోనే పోలీస్ స్టేషన్ ఆధునీకరణ
- నూతన భవనాన్ని ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం..

**కరీంనగర్ మహా :** కరీంనగర్ నగర ప్రజలకు మరింత మెరుగైన అందించేందుకు టూ టౌన్ పోలీస్ స్టేషన్ భవనాన్ని హైటెక్ హంగులతో ఆధునీకరించారు. భవనం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. మహిళ సిబ్బంది కోసం ప్రత్యేక వసతి విశ్రాంతి గదిని ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ అత్యుత్తమంగా తీర్చిదిద్దడంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ప్రత్యేక చొరవ చూపారు. దీంతో ఈ పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆయన మంగళవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, నూతనంగా తీర్చిదిద్దిన విభాగాలను పరిశీలించారు. ఈ భవనం పైఅంతస్తులో ఉన్న సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను రూరల్ ఏసీపీ కార్యాలయ ఆవరణలోకి మార్చారు. దీంతో మొత్తం భవనాన్నిటూ టౌన్ పోలీస్ స్టేషన్ అవసరాలకు అనుగుణంగా కేటాయించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పెరగడం, ముఖ్యంగా మహిళా పోలీసుల సంఖ్య పెరగడంతో వారి కోసం ప్రత్యేకంగా విశ్రాంతి గది ఇతర మౌలిక వసతులను కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడం వల్ల వారు మరింత ఉత్సాహంగా ప్రజలకు సేవలందిస్తారని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మహిళా సిబ్బంది సౌకర్యార్థం ప్రత్యేక బారక్‌ను నిర్మించడం సంతోషకరం" అని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్, వెంకటస్వామి, విజయకుమార్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ సృజన్ రెడ్డితో పాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పూలే విగ్రహాల ఏర్పాటు పై రాజకీయం చేయొద్దు

- మంత్రి కొండా సురేఖ ద్వంద వైఖరిని ఖండస్తున్నాం
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల ఏర్పాటులో మంత్రి కొండా సురేఖ రాజకీయ ద్వంద వైఖరి అవలంబిస్తున్నారని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని నెలల క్రితం వరంగల్ నగరంలోని కరీమాబాద్, ఉర్సు దర్గా ప్రాంతంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేసారు. బీసీల ఆరాధ్యదైవం అయిన మహాత్మాపూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం పై బీసీ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక ప్రజలతో కలసి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేశారు. ఉర్సు గుట్టలో దుండగుల చేతిలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ధ్వంసం అయిన వెంటనే స్పందించి, తన సొంత ఖర్చుతో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల పునఃప్రతిష్టకు శంకుస్థాపన చేసారు. తద్వారా విగ్రహాన్ని ధ్వంసం చేసిన కుటిల రాజకీయ శక్తులకు కేవలం రాజకీయ సమాధానం మాత్రమేనని సామాజిక న్యాయం దిశగా గట్టి హెచ్చరక పంపారు. కాగా బీసీలలో ఎక్కడ తనకు మంచి పేరు వస్తుందనే కారణంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని, నిర్మాణ అనుమతుల పేరుతో జ్యోతిరావు పూలే విగ్రహ ప్రతిష్ట పనులను మంత్రి కొండా సురేఖ అడ్డుకున్న విషయం ప్రజలందరికీ తెలుసని నన్నపునేని నరేందర్ ధ్వజమెత్తారు. ఆ రోజు అధికార బలంతో పనులను ఆపించిన మంత్రి కొండా సురేఖ, నేడు 35వ డివిజన్‌లో "విగ్రహ ప్రతిష్టకు సహకారం అందిస్తామని ప్రకటించడం వెనుక ప్రజలను, ముఖ్యంగా బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని, ఇది ఆమె రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని నన్నపునేని మండిపడ్డారు. అనాడు పూలే ఆశయాలకు అడ్డు నిలిచిన మంత్రి కొండా సురేఖ దుర్మార్గ చరిత్రను నేడు మాటలతో కప్పిపుచ్చే ప్రయత్నాన్ని వరంగల్ ప్రజలు అంగీకరించరని నన్నపునేని స్పష్టం చేశారు. విగ్రహల వద్ద ఫోటోలు దిగడం పూలేకు గౌరవం కాదని, ఆయన ఆశయాల కోసం అడ్డంకులు లేకుండా నిలబడి పోరాడడమే నిజమైన నివాళి అని పూలే ఆశయాలు రాజకీయ అవసరాలకు కాదు బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించినవని ఆ సత్యాన్ని ఎవరూ మార్చలేరనిపూలే విగ్రహాల ఏర్పాటు విషయంలో మంత్రి కొండా సురేఖ నియోజకవర్గంలోని 2 వేరు వేరు చోట్ల ద్వంద వైఖరిని వరంగల్ ప్రజలు గమించాలని, ఎట్టి పరిస్థితులలో ఉర్సు దర్గా ప్రాంతంలో ధ్వంసమైన పూలే విగ్రహం స్థానంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేసి తీరుతామని నన్నపునేని నరేందర్ స్పష్టం చేశారు.




# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, మహా :** రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జనవరి 1 నుండి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ కరీంనగర్ జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ఎక్కువగా ఉన్నందున రాత్రి వేళల్లో దారి కనిపించక చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సంభవిత అధికారులు ఈ మార్గంలో వాహనదారులకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతు దినోత్సవం

**ఆకట్టుకున్న చిన్నారులు రైతుల వేషధారణ**




**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండల పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు రైతుల వేషధారణలో ఆకట్టుకుంది. పంటపొలాల్లో పనులు చేస్తూ చిన్నారులు అబ్బురపర్చారు. బాలబాలికలు పలుగు, పార, వరిపైర్లు రైతుల్లా పనులు చేశారు. పాఠశాల డైరెక్టర్ వి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతు అని, దేశానికి అన్నం పెట్టడం కోసం అ హర్నిశలు కృషి చేసే రైతన్నకు కోటి వందనాలు పేర్కొన్నా రు. సైనికులు దేశానికి కాపాడే బాధ్య త తీసుకుంటే.. రైతు దేశాని కి అన్నం పెట్టే గొప్ప బాధ్యతను తీసుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థిని,విద్యార్థులు రైతుల వేషధారణలో చక్కగా తయారై పాటలతో నృత్యాలు చేశారు. దీంతో విద్యా ర్థులు చేసిన నృత్యాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ విటల్ ఉపాధ్యాయులు, మేఘణ అన్నపూర్ణ,కళావతి,రాజేశ్వరి,ప్రేమ్ రాజ్, బాబు, తదితరులు పాల్గొన్నారు

# శంషాబాద్ అస్తిత్వాన్ని కాపాడుకుందాం..

**శంషాబాద్ ను జోన్ గా ప్రకటించాలని జేఏసీ ఆధ్వర్యంలో వ్యాపారస్తుల స్వచ్ఛందం బంద్...**

**రాజేంద్రనగర్ , మహా ;** శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ప్రకటించాలని జేఏసీ ఆధ్వర్యంలో వర్తక వ్యాపారస్తులు మంగళవారం స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. శంషాబాద్ ను జోన్ గా ప్రకటించాలని కళాశాలలు, పాఠశాలలు వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు తెలిపారు. శంషాబాద్ జోన్ ను చార్మినార్ లో కలపవద్దుని జేఏసీ నాయకులు కొన్నమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. సందర్భంగా కొన్నమొల్ల మాట్లాడుతూ శంషాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలి. పార్టీలకు జెండాలకు అతీతంగా శంషాబాద్ ను జోన్ గా ప్రకటించేంతవరకు ఒకే ఒక నినాదం పొలిటికల్ జేఏసీ పనిచేస్తుందన్నారు. జేఏసీ నాయకుల పైన ఇతర పార్టీల నేతలు పలు రకాలుగా ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సమస్యలు ఏర్పడిన జోన్ ప్రకటించేంతవరకు ఉద్యమ బాట వీడేది లేదని జేఏసీ నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు శంషాబాద్ ప్రజల మనోభావాలకు సానుకూలంగా స్పందించి జోన్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. శంషాబాద్ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్ గా తక్షణమే ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శంషాబాద్ ను నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే శంషాబాద్ ప్రజల తోడ్పాటుతో జోన్ ఏర్పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతంగా తీసుకెళ్తామని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మంచర్ల మోహన్ రావు,బుర్కంటా సతీష్, రమేష్, వెంకట్ రెడ్డి, నర్రగిరి, అన్నే ప్రభు ముదిరాజ్, కే వై ప్రణయ్, జిల్లా ఆనంద్, ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిలేటి, మల్లేష్ ముదిరాజ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# మైసమ్మ దేవాలయం కూల్చడం హేయమైన చర్య

**ములుగు రహదారిపై ఆందోళన చేసిన బిజెపి శ్రేణులు, స్థానిక ప్రజలు**

- పోలీస్ తోపులాట లో డివిజన్ అధ్యక్షుడికి తీవ్ర గాయాలు
- ఆలయ నిర్మాణ దాత బొల్లం రవి ఆత్మహత్య ప్రయత్నం
- కూల్చివేత ను ఖండించిన బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని పైడిపల్లి గ్రామంలో వెలసిన మైసమ్మ అమ్మవారికి కొంతకాలం క్రితం బొల్లం రవి అనే భక్తుడు ఆలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో మంగళవారం పైడిపల్లి గ్రామంలోని మైసమ్మ ఆలయాన్ని కొందరు అధికారులు తొలగించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఎటువంటి సమాచారం లేకుండా ఆలయాన్ని కూల్చి వేశారని ఆలయ నిర్మాణ దాత అయిన బొల్లం రవి మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడని ప్రాణపాయస్థితిలో ఉన్న అతడిని స్థానికులు సమీపంలోని అజార హాస్పిటల్ కు తరలించడం జరిగిందని తెలిసింది. ఆలయాన్ని కూల్చి వేయడం పై పైడిపల్లి ప్రజలు భగ్గుమన్నారు. విషయం తెలుసుకున్న వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ కూల్చిన ఆలయాన్ని సందర్శించి ఆగ్రహం వ్యక్తం చేసారు. అనంతరం కూల్చివేతకు నిరసనగా బిజెపి శ్రేణులు, స్థానిక ప్రజల తో కలిసి జిల్లా అధ్యక్షులు ములుగు ప్రధాన రహదారి పై ఇస్కాన్ టెంపుల్ వద్ద బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఏనుమాముల పోలీసులకు బిజెపి శ్రేణులకు జరిగిన తోపులాటలో పోలీసులు అతి ఉత్సాహం వల్ల ఒక్కసారిగా డివిజన్ అధ్యక్షుడు తిరుపతి పై పోలీసులు పడడంతో తీవ్ర గాయాల పాలై స్పృహ కోల్పోయాడు. దీంతో ములుగు ప్రధాన రహదారి రణరంగల్లా మారింది. హిందువులపై పోలీసుల దౌర్జన్యం నశించాలి అంటూ నినాదాలతో బిజెపి శ్రేణులు హోరెత్తించారు. దీంతో ఎనుమాముల పోలీస్ ఇన్స్పెక్టర్ జె సురేష్ కు బిజెపి శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసుల సూచనలతో స్పృహ కోల్పోయిన తిరుపతిని అత్యవసర చికిత్స నిమిత్తం హుటాహుటిన ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఎంజిఎం వైద్యులు అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్న తిరుపతిని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్ అతని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్ మాట్లాడుతూ మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని కూల్చివేయడం హేయమైన చర్య అని కేవలం హిందూ ఆలయాలనే లక్ష్యం చేసుకున్నారని విమర్శించారు. చాలా చోట్ల ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, అర్ధరాత్రి వేళల్లో కూల్చివేతలు చేపట్టడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కూల్చివేసిన ఆలయాన్ని వెంటనే పునర్నిర్మించాలని బాధ్యులైన అధికారుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. మైసమ్మ ఆలయాన్ని కూల్చడం మహాపాపమని ఇది ప్రజల నమ్మకాన్ని అవమాన పరచడమే అంటూ గంట రవికుమార్ మండిపడ్డారు. దారి మైసమ్మ ఊరి ఆత్మ గౌరవాన్ని కూల్చేస్తే తమ ఊరిని కాపాడే శక్తి తగ్గిపోతుందంటూ గ్రామస్తులు ఊరి పెద్దలు విచారం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కొంతమంది స్థానికులు ఇది మున్సిపల్ సిబ్బంది చే జరిగిందా, లేక ప్రైవేటు వ్యక్తుల కోసం కూల్చారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పూర్వం నుండి ఊరి బయట రహదారి పక్కన ఎక్కడైనా ప్రమాదాలు జరగకుండా అమ్మవారు కాపాడాలని నమ్మి ప్రజలు దారి మైసమ్మల ను ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తూ వస్తుంటారు. అధికారుల నుంచి మాత్రం ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదని ప్రస్తుతం వరంగల్ నగరంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ధార్మిక భావాలను దెబ్బతీసే ఈ చర్యపై విభిన్న వర్గాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





# వైభవంగా కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్ ప్రారంభం

**ఆట పాటలతో సందడి చేసిన అందాల సినీ తార ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్**

**వరంగల్ మహా;** పలమనేరు పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 24 వ అతి పెద్ద షాపింగ్ మాల్ ను అనసూయ భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్ తో నిత్య నూతన వెరైటీ లతో కాసం ఫ్యాషన్స్ పేరు గాంచిందని అన్నారు. ఈ స్టోర్ ను పలమనేరు లో మొట్టమొదటిసారిగా అతి పెద్ద షాపింగ్ మాల్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా అనసూయ భరద్వాజ్ కాసం ఫ్యాషన్స్ లోని లేడీస్ జెంట్స్ కిడ్స్ వెర్ అంతా కలియతిరిగి సందడి చేసారు. పలమనేరు చుట్టు పక్కల ప్రాంత వాసులు కాసం ఫ్యాషన్స్ లో షాపింగ్ చేయాలని కోరారు. ముందుగా మాజీ మంత్రి శాసనసభ్యులు అమరనాథ్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి షోరూం లోని పై అంతస్తులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలమనేరు లో మాల్ ప్రారంభం చేయడం ఆనందంగా ఉందని ప్రజలకు కొత్త షాపింగ్ అనుభూతి ని కలిగిస్తుందని స్థానికులకు ఉపాధి అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా వరంగల్ నగరానికి చెందిన కాసం షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత 5 సంవత్సరాలుగా తెలుగు ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లలో 24 స్టోర్స్ ప్రారంభించి కొన్ని లక్షల మందికి జీవనోపాధి కల్పించామని అన్నారు. నూతన వెరైటీలతో నాణ్యత కలిగిన మా వస్త్రాలను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న తెలుగు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అందాల భామ సినీనటి అనసూయ భరద్వాజ్ ను చూడడానికి ఉదయం నుండి అభిమానులు, పరిసర ప్రాంతాల నుండి యువతి, యువకులు బారులు తీరారు. యువతి యువకుల కేరింతలతో కాసం షాపింగ్ మాల్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం లో పుల్లూరు అరుణ్ కుమార్, విశాల్, వరుణ్, అరుణ్, కార్తీక్, కాసం ఫణిత్, కాసం సాయికృష్ణ, యాంసాని ప్రవీణ్ తో పాటు పట్టణం లోని ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శత్రువు అనే భయాన్ని జయించాలి: పరిణతి పత్రీజీ

**ఆమనగల్లు, మహా:** శత్రువు అనే భయాన్ని జయించినప్పుడే విజయం లభిస్తుందని పరిణతి పత్రి అన్నారు, కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి మహేశ్వర మహా పిరమిడ్ లో ధ్యాన యాగ మహా సంబరాలు4 మూడో రోజు మంగళవారం ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు అధిక సంఖ్యలో హాజరయ్యారు, ఈ సందర్భంగా పరిణితి పత్రి మాట్లాడుతూ మనము ఏవిధంగా ఆలోచిస్తే ఫలితాలు కూడా అదే విధంగా ఉంటాయని, ప్రతి ఒక్క ఆధ్యాత్మిక యోధుడు భయాన్ని చేయించాలని అన్నారు, సమస్య వచ్చినప్పుడు ఎదిరించి విజయం సాధించిన వారి నిజమైన మాస్టర్ అని అన్నారు, ఆధ్యాత్మికవేత్తలు, పలువురు పిరమిడ్ ట్రస్టు సభ్యులతో కలిసి ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు, శాకాహార జగతి లక్ష్యంగా పత్రీజీ ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. మహేశ్వర మహా పిడుగులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.ధ్యాన మహాయాగం4 లో బ్రహ్మర్షి పితామహ పత్రీజీ జీవిత చరిత్రపై రూపొందించిన పత్రీజీ ఫిలిమ్ ట్రైలర్ ధ్యానులను విశేషంగా అలరిస్తుంది. ఈ ట్రైలర్ లో బ్రహ్మర్షి పత్రీజీ విజువల్స్ చూసి ధ్యానులు మధురానుభూతులకు లోనవుతున్నారు. ట్రైలర్ అధ్బుతంగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఈ ఫిలిమ్ కు పిరమిడ్ మాస్టర్ వెంకట్ దర్శకత్వం వహించారు. తాను పొందిన జ్ఞానాన్ని ప్రతి ఒక్కరికీ పంచాలని





జీవితాంతం కృషి చేసిన గొప్ప వ్యక్తి బ్రహ్మర్షి పత్రీజీ అని కొనియాడారు మాజీ సీబీఐ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ కార్తికేయన్. ధ్యానాన్ని అందరికీ అతి సులువైన మార్గంలో అందించారన్నారు. తన చివరి శ్వాస వరకు ధ్యాన జగత్ కోసం కృషి చేసారని ప్రశంసించారు. బ్రహ్మర్షి పత్రీజీ అందరినీ ఎంతగానో ప్రేమించేవారని, మహేశ్వర మహాపిరమిడ్ ను అధ్భుతంగా తీర్చిదిద్దారని, రాబోవు రోజులో ఈ పిరమిడ్ టూరిజం స్పాట్ గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. ప్రతి పిరమిడ్ మాస్టర్ బాగా కష్టపడి మొత్తం మానవాళికి ధ్యానాన్ని అందించాలని సూచించారు.పత్రీజీ ధ్యాన మహాయాగంలో బ్రహ్మర్షి పత్రీజీ కూతురు పరిణిత పత్రీ అందిస్తున్న సందేశాలు ధ్యానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో మూడో రోజు పరిణిత పత్రీ అహింసా అనే అంశం గురించి చక్కగా వివరించారు. . అహింసా అనేది ఆహారంలోనే కాకుండా మన అలోచనలు, మాటల్లో కూడా ఉండాలని తెలిపారు. ఎవరినీ కూడా దూషించకూడదని, విమర్శలు చేయకూడదన్నారు.మనసా, వాచా, కర్మణా అహింసా పాటించాలని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ అహింసా మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు లక్ష్మి, సాంబశివరావు, దామోదర్ రెడ్డి,మాధవి,జ్యోతి, హనుమంతరావు పిరమిడ్, ధ్యానులు, తదితరులు పాల్గొన్నారు

# భవిష్యత్ ఎన్నికల్లో బీజేపీనే దేశానికి దిక్సూచి

**భవిష్యత్ మనదే... అందరూ ధైర్యంగా ఉండాలి: తల్లోజు ఆచారి**

**ఆమనగల్లు, మహా:** భవిష్యత్ ఎన్నికల్లో బీజేపీనే దేశానికి దిక్సూచి అవుతుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి స్పష్టం చేశారు.ఆమనగల్లు పట్టణంలోని ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన 14 మంది సర్పంచ్‌లు, 35 మంది ఉప సర్పంచ్‌లు, 310 మంది వార్డు సభ్యులకు కల్వకుర్తి బీజేపీ నియోజకవర్గం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈసభకు ముఖ్య అతిథిలుగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు, నాగర్ కర్నూలు ఇంచార్ కెవిఎల్ఎన్ రెడ్డి రాజు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి మాట్లాడుతూ బీజేపీ సాధించిన ఫలితాలు ఎవరు ఊహించనివని, పార్టీ సిద్ధాంతాలను నమ్మి కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలను



గ్రామ ప్రజలు విశ్వసించి గెలిపించారన్నారు. దేశంలో మార్పు కోరేది బీజేపీ మాత్రమేనని, యువత వల్లే ఆ మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఓటమి అనేది గెలుపు మెట్లకు నాంది మాత్రమేనని, విశ్వసనీయతను నిరూపించుకుంటే విజయం తప్పకుండా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఎంఎల్ఏలకు రావాల్సిన ఐదు కోట్ల రూపాయల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని విమర్శించారు. అనేక హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్స్ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు.మహాత్మా గాంధీ ఆశయాలను కాంగ్రెస్ పట్టించుకోలేదని, గాంధీ కళలను బీజేపీ అమలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్‌కు గాంధీ పట్ల నిజమైన ప్రేమ లేదని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం కేంద్ర నిధులను నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తోందని గుర్తుచేశారు. బీజేపీ పట్టణ పార్టీ మాత్రమే కాదని, గ్రామాల్లో కూడా గెలుస్తుందని నిరూపించిందని అన్నారు. రానున్న రోజుల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో జిల్లా పరిషత్, మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.బీజేపీ నుంచి గెలిచిన కొంతమంది ఇతర పార్టీలలోకి వెళ్లారని వ్యాఖ్యానించిన ఆయన, బీజేపీ తరువాత కమ్యూనిస్టులకే కొంత చిత్తశుద్ధి ఉంటుందని అన్నారు.గ్రామాల్లో ప్రతి వారం స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించాలని,అవినీతి లేకుండా పాలన సాగించాలని సూచించారు. నీతి, నిజాయితీతో పనిచేస్తే గౌరవం సహజంగానే వస్తుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేస్తుందని తెలిపారు. భవిష్యత్ మనదే... అందరూ ధైర్యంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## మైసిగండి మైసమ్మ ఆదాయం రూ 30,97,000

**ఆమనగల్లు, మహా:**కడ్తాల్ మండల పరిధిలోని మైసమ్మ, రామాలయ ఆలయంలో మంగళవారం దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి మురళీ కృష్ణ, ఫౌండర్ ట్రస్ట్ లక్ష్మీ సిరోలి, ఈవో స్నేహలత, ఆధ్వర్యంలో అమ్మవారి కొబ్బరి చిప్పలు, ఒడిబియ్యం చీరలు, సేకరించి హక్కు బహిరంగ వేలం నిర్వహించారు,బహిరంగ వేలంలో ముగ్గురు పాల్గొనగా పాల్గొనగా మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ పరంసింగ్ రూ 13,97,000రూపాయలకుదక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ఉప ప్రధాన అర్చకులు మాదారం యాదగిరి,సిబ్బంది కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్ కుమార్. హర్షవర్ధన్, వెంకటేష్,చారి, అంజయ్య అమర్ సింగ్ నాయక్,శివరాం నాయక్ గోపి నాయక్ పాల్గొన్నారు.

## మార్షల్ ఆర్ట్స్ లో కేజీబీవీ ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ

**ఆమనగల్లు, మహా:** 2025లో నిర్వహించిన తొలి నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) ఆమనగల్లు విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. మాస్టర్ సోను శిక్షణలో రాటుదేలిన ఈ విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ సత్తా చాటి, మొత్తం 18 గోల్డ్ మెడల్స్, 2 సిల్వర్ మెడల్స్ సాధించి ఘన విజయాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌ను బివిస్కెఎ వ్యవస్థాపకులు, గ్రాండ్ మాస్టర్ షిహాన్ కె. పృథ్వి అత్యంత విజయవంతంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి అనేక జట్లు పాల్గొన్న ఈ పోటీలో, అన్ని జట్లతో పోలిస్తే కేజీబీవీ ఆమనగల్లు విద్యార్థులు అత్యధికంగా 18 గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం. ఈ విజయం పాఠశాలకు గర్వకారణంగా నిలవడమే కాకుండా, రాష్ట్ర స్థాయిని దాటి జాతీయ వేదికపై కూడా ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభను చాటిచెప్పింది. జాతీయ స్థాయిలో ఇన్ని పతకాలు సాధించడం పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచింది. ఈ విజయవార్త తెలుసుకున్న ప్రిన్సిపల్ పద్మజ్యోతి విద్యార్థులకు, కోచ్ సోను అభినందించారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరింత కష్టపడి ఇంకా ఎక్కువ మెడల్స్ సాధించాలని, అంతర్జాతీయ స్థాయిలో కూడా మన దేశానికి ప్రాతినిధ్యం వహించి పాఠశాల పేరును నిలబెట్టాలని ఆమె ఆకాంక్షించారు.



# ప్రపంచ దేశాలతో సమానంగా సింగరేణిలో అత్యాధునిక యంత్రాల ప్రవేశం

- సింగరేణి ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ గ్రామాల అభివృద్ధి చేపడుతోంది
- ఘనంగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

**మందమర్రి, మహా :** ప్రపంచ దేశాలతో సమానంగా సింగరేణి బొగ్గు పరిశ్రమలో అత్యాధునిక యంత్రాల ప్రవేశం చేపట్టామని మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం సింగరేణి సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ ఉద్యోగుల శ్రమతోనే బొగ్గు వెలికి తీసే స్థాయి నుండి ప్రపంచ దేశాలతో దీటుగా అత్యాధునిక యంత్రాలను ఉపయోగించే స్థాయికి సింగరేణి చేరుకుందని వెల్లడించారు. భారత దేశాలలోని బహిరంగ గనులలో అన్ని బొగ్గు గనులకు దీటుగా సింగరేణి సంస్థ పని చేస్తుందని అన్నారు. సింగరేణి ఉత్పత్తి లక్ష్యాలను సాధించడమే కాకుండా పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తుందని వివరించారు. ఈ సంవత్సరం 2025-26, ఏప్రిల్ 2025 నుంచి 17. డిసెంబర్ 2025 వరకు కంపెనీ మొత్తానికి నిర్దేశించిన ఉత్పతి లక్ష్యం-48.34 మెట్రిక్ టన్నులు కాగా 41.11 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేసి 85 శాతం సాధించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రానున్న మూడు నెలలలో కార్మికులు గైర్హాజరు కాకుండా ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బహిరంగ మార్కెట్ లో బొగ్గుకు తీవ్ర పోటీ ఉందని తెలిపారు. మన సంస్థ ఈ పోటీ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొని నిలబడాలంటే మన ఉత్పత్తి వ్యయం భారీగా తగ్గించుకోవాలని కార్మికులను కోరారు. యంత్రాలను కార్మికులు ప్రతి షిఫ్ట్ లో పూర్తి పనిగంటలు వినియోగించి ఉత్పత్తి సాధించాలని ఈ విషయంపై మనం ప్రతి మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశాల్లోనూ గనులపై జరిగే సమావేశాలలో తెలుపుతూనే ఉన్నామని అన్నారు. ప్రస్తుతం కొంతమంది పనిగంటలు కొంత మెరుగైనప్పటికీ ప్రతి షిఫ్ట్ లో కార్మికుల పనిగంటలు యంత్రాల పని



గంటలు ఇంకా పెరగాల్సి ఉందని అన్నారు. అలా చేసినప్పుడే మనం ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని చెప్పారు. ఏరియాలో 5976 మంది కార్మికులు పదవీ విరమణ పొందగా వారికి సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డు ద్వారా 8 లక్షల రూపాయల కార్పొరేట్ వైద్య బీమా సదుపాయం మన కంపెనీ అందిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు సొంతగృహ నిర్మాణానికి తీసుకున్న పది లక్షల రుణం మీద చెల్లించే వడ్డీని కంపెనీ ఏ చెల్లిస్తోందని ఇప్పటివరకు 570 మందికి ఇంటి రుణం పై వడ్డీ చెల్లించామని వారు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏరియాలో 110 మెగావాట్ల సౌర విద్యుత్ శక్తిని కూడా ఉత్పత్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరిలో మనం-మన కోసం, మన కంపెనీ కోసం, మన రాష్ట్రం కోసం, పనిచేస్తున్నాము అనే భావాన్ని మనసా వాచా కర్మణా ఆచరిస్తూ సమిష్టిగా కృషి చేస్తూ మన కంపెనీకి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆయన వెల్లడించారు. అనంతరం మందమర్రి ఏరియాలో ఉత్తమ అధికారులు, ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు ఘనంగా సన్మానించి, సింగరేణి పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ, ఎస్.ఓ.టు జి.ఎం జి ఎల్ ప్రసాద్, సీ.ఎం.ఓ.ఏ.ఐ. మందమర్రి అధ్యక్షులు రమేష్, ఏరియా డీజీఎం పర్సనల్ అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ బొంగోని శంకర్, జనరల్ మేనేజర్ కార్యాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది,అన్నిగనుల ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అంతకు క్రితం సింగరేణి జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు.



## కంచర్ల రామకృష్ణారెడ్డిని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**భువనగిరి, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా దరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం మాజీ మంత్రి హరీష్ రావు పెద్ది సుదర్శన్ రెడ్డి దేవిప్రసాద్ భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి తదితరులు పరామర్శించారు



## అయ్యప్ప స్వాముల మండల పూజ పోస్టర్లు విడుదల

**మందమర్రి, మహా :** మందమర్రి మండల కేంద్రం హరిహర దేవస్థానంలో మంగళవారం మహా మండల పూజ మహోత్సవం పోస్టర్లను అయ్యప్ప స్వాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురు స్వాములు మాట్లాడుతూ 26 డిసెంబర్ సాయంత్రం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నుండి పట్టణ ప్రధాన వీధుల గుండా స్వామి వారి సంకీర్త కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ భక్తజనం అధిక సంఖ్యలో హాజరై అయ్యప్ప స్వామి భగవంతుని కృపకు పాత్రులు కావాలని కోరారు. అంతేకాకుండా 27 డిసెంబర్ ఉదయం నాడు గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి వివిధ రకాల ఫలాలతో విశేష అభిషేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అమ్మవారి చీరల వేలం భిక్ష కార్యక్రమం తో పాటు సాయంత్రం కేరళ రాష్ట్రానికి చెందిన స్వామి సంజీవ్ నమ్బుద్రి ఆధ్వర్యంలో మహా మండల పూజ, అగ్నిగుండాల కార్యక్రమాన్ని తలపెట్టినట్లు వారు వివరించారు. ఈ సమావేశంలో మద్ది శంకర్ స్వామి,బత్తుల శ్రీనివాస్ స్వామి, శివ ఎలక్ట్రానిక్స్ శ్రీనివాస్ స్వామి, మెడికల్ షాప్ రవి స్వామి, రమేష్ స్వామి, కొమ్ము రాజేష్ స్వామి తో పాటు తదితర గురు స్వాములు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలి

- ప్రతి ఒక్కరు రోడ్డు సేఫ్టీ ప్రమాణాలను పాటించాలి
- జిల్లా లోకల్ బాడీ అదనపు కలెక్టర్ శ్రీనివాస్
- సమావేశంలో పలు శాఖల అధికారులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని అవగాహన తోనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రత చర్యలు అనే అంశంపై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. పవర్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాలు అధికంగా అవుతున్న ప్రాంతాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారించేందుకు పోలీస్ మున్సిపల్ నేషనల్ హైవే ఆర్ అండ్ బి, ఆర్టిసి అధికారులంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఇందులో ప్రజలు కూడా సహకరించాలన్నారు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ తారకమంత్రమని, పరిసరాలను గమనిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో వాటి నియంత్రణకు భద్రత చర్యలు చేపడతామన్నారు. ఇందుకు అవసరమైన చోట ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని



అధికారులకు సూచించారు. ఈ సంవత్సరం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలనీ, అందుకు అవసరమైన పనులు చేపట్టేందుకు అనుమతిస్తామని పేర్కొన్నారు. మొత్తానికి రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా రంగారెడ్డి జిల్లాను అధికారులంతా సమిష్టిగా తీర్చిదిద్దాలని సూచించారు..

**నిర్లక్ష్యం అతివేగం కారణంగా ప్రమాదాలు....**

ఈ ప్రమాదాలకు ముఖ్య కారణం అతివేగం నిర్లక్ష్యంగా మద్యం తాగి డ్రైవింగ్ చేయడమేనని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అన్ని పని చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎక్కడ ఏం అవసరం ఉన్నా అధికారులు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. కళాశాల విద్యార్థులు స్కూల్ పిల్లలకు అవగాహన కల్పించాలని, ఎవరైనా రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదే విధంగా అనుమతించబడిన వేగం వరకే వాహనాలు నడపాలని అతివేగంగా, రాంగ్ రూట్లో వాహనాన్ని నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి, ట్రాన్స్పోర్ట్, నేషనల్ హై వే, పోలీస్, ట్రాఫిక్, ఆర్టీసీ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర వ్యవసాయ విధానం పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చు

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్**

**సూర్యాపేట జిల్లా మహా:** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రైతుల దినోత్సవం మరియు కిసాన్ మేళా ను కేవీకే ఇంఛార్జి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి నరేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభించి వివిధ కంపెనీలు,విద్యార్థులు ఏర్పాటు చేసిన మేళా ను తిలకించి పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అందరూ కేవలం ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ వాణిజ్య పంటలు వేసుకునట్లైతే అధిక ఆదాయం పొందాదని ఆస్కారం ఉంటుందని అన్నారు. రైతులు నూతన పరిజ్ఞానంతో కూడిన సాంకేతికతనుఉపయోగించుకొని వ్యవసాయం చేయాలన్నారు.ప్రస్తుతం ఆధునీకరణలో భాగంగా నూతన వంగడాలు, యంత్రాలు, విత్తనాలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులను రైతులు ఉపయోగించే అధిగ దిగుబడులను పొందాలని సూచించారు.రైతులకు కేవలం ఒకే పంట పైన ఆధారపడకుండా ఉద్యాన పంటలైనటువంటి కూరగాయలు పండ్లతోటలు ఆయిల్ వంటివి కూడా సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని పొందాలని తెలిపారు. విశిష్ట అతిధి డా.షేక్ ఎన్ మీరా డైరెక్టర్ అటారి జోన్ 10 వారు మాట్లాడుతూ రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అవలంబించుకొని, సేంద్రియ వ్యవసాయ విధానాలను పాటిస్తూ ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే హానికరమైన పురుగు మందులను తక్కువగా పిచికారి చేసినట్లైతే పర్యావరణంలోని మిత్ర పురుగులను కాపాడుకోవచ్చు అన్నారు. సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఇన్చార్జి డి నరేష్ మాట్లాడుతూ కేవీకే లో రైతుల కోసం చేపట్టే వివిధ కార్యక్రమాల గురించి ప్రత్తిలో వచ్చిన నూతన విధానమైన అధిక సాంద్రత పద్ధతి గురించి తెలిపారు అలాగే ప్రత్తిలో అధిక సాంద్రత పద్ధతి, తద్వారా రైతులకు కలిగే ఉపయోగాల గురించి తెలిపారు. తదుపరి కేవీకే శాస్త్రవేత్తలు రైతుల కోసం చేసే శిక్షణ కార్యక్రమాల గురించి విచ్చేసిన రైతులకు తెలిపారు. తదుపరి అధిక సాంద్రత పద్ధతి ద్వారా ప్రత్తి సాగు చేసిన రైతులు వారి యొక్క అనుభవాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి, నాగయ్యా, జిల్లా ఉద్యాన అధికారి,డా.ఏ ఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్, అటారి హైదరాబాద్, డా.సాహు సైంటిస్ట్, అటారి హైదరాబాద్, డా మురుగప్ప, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్, టి ఎన్ ఎ యు కోయంబత్తూరు, కేవీకే శాస్త్రవేత్తలు, వివిధ కంపెనీల అధికారులు, రైతులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కవిత జాగృతి జనం బాట

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లాలో జాగృతి జనం బాట కార్యక్రమంతో మంగళవారం జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పర్యటించారు కవితకు భువనగిరి పట్టణంలోని వినాయక చౌరస్తా వద్ద జాగృతి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు గజమాలతో కవితను సత్కరించారు రాయగిరిలో ట్రిపుల్ ఆర్ నిర్వాసితులతో సమావేశం అయి వారి సమస్యలను కవిత అడిగి తెలుసుకున్నారు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 16 జిల్లాల్లో పర్యటించామని మా చొరవతో చాలా సమస్యలు పరిష్కారమవుతుండటం సంతోషంగా వుందన్నారు. ఎయిమ్స్ ను ఇవ్వాళ మేము సందర్శించాం ఇక్కడ ఎమర్జెన్సీలో మందులు కూడా లేవు 20142015 లో మేము పార్లమెంట్ లో పట్టుబట్టి తెలంగాణకు ఎయిమ్స్ వచ్చేలా చేసుకున్నామని మొదటి బ్రౌన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ ఇది. నిమ్స్ ను మనం ఎయిమ్స్ చేసుకున్నాం. 2016లో ప్రారంభమైనప్పటికీ ఇప్పటికీ కూడా ఇక్కడ ఎమర్జెన్సీ మందులు లేవన్నారు. యాక్సిడెంట్ అయి ఇక్కడకు వస్తే ప్రాణాలు పోయే పరిస్థితి ఉందన్నారు కేంద్రం నుంచి రూ. 750 కోట్లు వచ్చినప్పటికీ కాంట్రాక్టర్ ఆలస్యం చేస్తున్నాడని చెబుతున్నారు. ఇంతమంచి ఇన్‌స్టిట్యూట్ వచ్చినప్పుడు దాన్ని పూర్తి చేయించుకునే బాధ్యత మనదే అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యేలు, మంత్రులు కాంట్రాక్టర్ తో మాట్లాడి ఎయిమ్స్ ను పూర్తి చేయాలని ఆమె డిమాడ్ చేశారు. ఇక భువనగిరిలోని రాయగిరి RRR వల్ల ప్రజల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది ఇప్పటి వరకు వాళ్లు ఆరేడు ప్రాజెక్ట్ ల కోసం భూమిని ఇచ్చి ఎంతో త్యాగం చేశారు. ఎలాగు భూమి ఇస్తున్నారని ట్రిపుల్ ఆర్ కోసం కూడా



వాళ్ల భూములు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికీ ఈ ఆలైన్ మెంట్ మూడు సార్లు మారిందన్నారు దీని వెనుక చాలా అవినీతి జరిగింది. ఎమ్మెల్యేలు వాళ్ల భూములు కాపాడుకోవటం కోసం ఆలైన్ మెంట్ మారుస్తున్నారని ఆరోపించారు ట్రిపుల్ ఆర్ ఆలైన్ మెంట్ మారిపిస్తానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు మాటిచ్చారు. ప్రజలకు న్యాయం చేస్తారా లేదా అన్నది క్లారిటీ గా చెప్పాలన్నారు ప్రియాంక గాంధీని కూడా తీసుకొచ్చి ఇక్కడి ప్రజలకు మాట ఇచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లో ఇక్కడ రైతులకు బేడీలు వేశారు. అప్పుడు నేను బీఆర్ఎస్ లోనే ఉండి మీకు ఏమీ చేయలేకపోయినందుకు నన్ను క్షమించండి. ఈ విషయం నా దృష్టికి రాలేదు. వచ్చి ఉంటే కచ్చితంగా మీకోసం పోరాటం చేసేదాన్ని. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ భూముల కోసం రైతుల భూములను బలి చేయటం దుర్మార్గమన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దుర్మార్గాన్ని కొనసాగిస్తుందా? చెప్పాలి? ఇక్కడ రైతులు భూములు ఇచ్చేదే లేదని చెబుతున్నారు. ప్రియాంక గాంధీ గారు వచ్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు కవిత...



## గెలిచిన కాంగ్రెస్ సర్పంచ్ లకు ఆత్మీయ సన్మానం

**యాదగిరిగుట్ట, మహా:** ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని పలు గ్రామాల్లో గెలిచిన కాంగ్రెస్ గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ లను నేడు యాదగిరిగుట్టలో జిల్లా ఇన్ చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్,ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు బీర్ల అయిలయ్య, భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ఘనంగా సత్కరించారు... ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ లతో పాటు ఓడిన కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను కూడ శాలువా,మెమొంటో సన్మానించి శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి లడ్డును బహుకరించారు...కార్యక్రమానికి ముందు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి,రాష్ట్ర నాయకులు జనగామ ఉపేందర్ రెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ,మార్కెట్ కమిటి చైర్మన్ లు అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## పర్యాటక శాఖ నగదు బహుమతులను ఫోటోగ్రాఫర్లు గెలుచుకోవాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో దాగి ఉన్న పర్యాటక అందాలను ఫోటోలు, వీడియోల రూపంలో పరిచయం చేసిన వారికి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భారీ నగదు బహుమతులు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో కల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంతరెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి కార్యక్రమం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పోటీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటివరకు ప్రాచుర్యం పొందని పర్యాటక ప్రాంతాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ పోటీ నిర్వహించబడుతుందని, ప్రజలకు తెలియని జలపాతాలు, పురాతన దేవాలయాలు, ట్రెక్కింగ్ పాయింట్లు వంటి 100 కొత్త గమ్యస్థానాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ప్రకృతి, వన్యప్రాణులు, కళా సంస్కృతి, వారసత్వం, జలాశయాలు, వంటకాలు, గ్రామీణ జీవనం, రిసార్ట్స్, ఆధ్యాత్మిక



ప్రాంతాలు, సాహస పర్యటనలు వంటి అంశాలపై ఫోటోలు, వీడియోలు పంపవచ్చని తెలిపారు. ఎంచుకున్న ప్రదేశానికి సంబంధించి 3 మంచి ఫోటోలు, గరిష్టంగా 50 సెకన్ల నిడివి గల వీడియో, ఆ ప్రదేశానికి రవాణా, బస, బడ్జెట్ వివరాలతో కూడిన 100 పదాల సమాచారాన్ని పోస్టర్ లో పేర్కొన్న గూగుల్ ఫామ్ / సోషల్ మీడియా ఎకౌంట్లకు ట్యాగ్ చేయవచ్చని తెలిపారు. ఉత్తమ ఎంట్రీలకు మొదటి బహుమతిగా 50 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 30 వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 20 వేల రూపాయలు అందించడం జరుగుతుందని, 10 మందికి హరిత హోటల్స్ లో 2 రోజులు / 1 రాత్రి ఉచిత వసతి కన్సోలేషన్ బహుమతులుగా అందజేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జనవరి 5 నాటి లోగా ఎంట్రీలు పంపించాలని, విజేతలను సంక్రాంతి కైట్ ఫెస్టివల్ సందర్భంగా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

# బోడ సుదర్శన్ మృతి పేద ప్రజలకు తీరని లోటు

**పల్లా వెంకట్ రెడ్డి**

**వలిగొండ, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యుడు వలిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బోడ సుదర్శన్ అకాల మరణం పేద ప్రజలకు కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు మంగళవారం అకాల మరణం చెందిన బోడ సుదర్శన్ అంతిమయాత్రలో పల్లా వెంకట్రెడ్డి పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు బోడ సుదర్శన్ ప్రజల శ్రేయస్సు కోరే వ్యక్తి అని పార్టీ ఇచ్చిన పిలుపులను అమలు చేసే వ్యక్తి అని కడదాక కమ్యూనిస్టుగా ఉన్నారని అన్నారు ఆయన మరణం తీరనిలోటని అన్నారు.



# 2026 నుంచి చైనా గేమ్ ప్లాన్ ఇదే..



ఇటీవల కాలంలో బంగారం అంటేనే కొండెక్కి కూర్చునే ధర అనుకున్న వారికి, ఇప్పుడు వెండి తన విశ్వరూపాన్ని చూపిస్తోంది. కేవలం ఏడాది కాలంలోనే సుమారు 120 శాతం పైగా రాబడి అందించి, కిలో వెండి ధర రికార్డు స్థాయిలో రూ.2 లక్షలను దాటింది. అయితే, ఈ పెరుగుదల ఇక్కడితో ఆగేలా లేదు. 2026 జనవరి 1 నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద వెండి ఉత్పత్తిదారు అయిన చైనా ఎగుమతులపై ఆంక్షలు విధించనుందనే వార్తలు గ్లోబల్ మార్కెట్‌లో సంచలనం సృష్టిస్తున్నాయి. సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కోసం మైక్రోచిప్‌ల తయారీలో వెండి వినియోగం పెరగడమే దీనికి ప్రధాన కారణం. ఒకప్పుడు కేవలం ఆభరణాలకే పరిమితమైన వెండి, ఇప్పుడు గ్రీన్ ఎనర్జీకి కీలకంగా మారింది. సరఫరా తక్కువ, డిమాండ్ ఎక్కువ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో 2026 ప్రారంభానికి ముందే కిలో వెండి ధర రూ.2.5 లక్షలకు చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అటు చైనా ఎగుమతుల కోత, ఇటు పెరుగుతున్న టెక్నాలజీ అవసరాల మధ్య వెండి ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు వెళ్లనున్నాయి.

**వెండి ఎగుమతులపై చైనా ఆంక్షలు**

ప్రపంచంలో వెండి ఉత్పత్తిలోనూ, ఎగుమతిలోనూ చైనాది కీలక పాత్ర. అయితే జనవరి 1, 2026 నుంచి చైనా ప్రభుత్వం వెండి ఎగుమతులపై కొత్త నిబంధనలను అమలు చేయాలని చూస్తోంది. అయితే వీటిని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ప్రతిపాదిత అంశాల ప్రకారం.. ఇకపై వెండిని ఎగుమతి చేయాలంటే కంపెనీలు ప్రత్యేక ప్రభుత్వ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. ఇది 2027 వరకు అమలులో ఉండే అవకాశం ఉంది. ఏడాదికి 80 టన్నుల కంటే తక్కువ ఉత్పత్తి చేసే చిన్న సంస్థలకు ఎగుమతి అనుమతులు నిరాకరించే అవకాశం ఉంది. కేవలం పెద్ద, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలకే ఈ అవకాశం దక్కుతుంది. చైనా తన దేశీయ అవసరాల కోసం (ముఖ్యంగా సోలార్, ఎలక్ట్రానిక్స్ రంగాలు) వెండి నిల్వలను కాపాడుకోవడం, అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధరలను ప్రభావితం చేయడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

**డిమాండ్ పెరగడానికి కారణాలు**

గ్రీన్ ఎనర్జీ విప్లవం.. వెండికి విద్యుత్ వాహకత చాలా ఎక్కువ. సౌర ఫలకాల తయారీలో వెండిని కీలకమైన సిల్వర్ పేస్ట్ రూపంలో వాడతారు. ప్రపంచం శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనం వైపు మళ్లుతుండటంతో సోలార్ ప్యానెల్స్ తయారీకి వెండి డిమాండ్ 2020తో పోలిస్తే 2024 నాటికి దాదాపు 150% పెరిగింది. ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐ.. సాధారణ కార్ల కంటే ఎలక్ట్రిక్ వాహనాల్లో వెండి వినియోగం చాలా ఎక్కువ. బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, సెన్సార్లు, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో వెండిని విరివిగా ఉపయోగిస్తారు. అంతేకాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ల విస్తరణ వల్ల అత్యాధునిక చిప్‌లు, సెమీకండక్టర్ల తయారీలోనూ వెండి వాటా పెరుగుతోంది. సరఫరాలో లోటు.. గడిచిన ఐదేళ్లుగా వెండి ఉత్పత్తి కంటే వినియోగం ఎక్కువగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా మైనింగ్ ద్వారా వచ్చే వెండి పరిమితంగా ఉంది. వెండి అనేది ఎక్కువగా రాగి, బంగారం, సీసం వంటి లోహాల వెలికితీతలో ఉపఉత్పత్తిగా ఉంది. కాబట్టి, డిమాండ్ పెరిగిన వెంటనే వెండి ఉత్పత్తిని పెంచడం మైనింగ్ సంస్థలకు సాధ్యం కావడం లేదు. సురక్షిత పెట్టుబడిగా వెండి.. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాల వల్ల పెట్టుబడిదారులు వెండిని సురక్షితమైన ఆస్తిగా భావిస్తున్నారు. అందుకే ఈ ఏడాది వెండి దాదాపు 120% పైగా రాబడిని ఇచ్చింది. 2026 నాటి చైనా ఎగుమతి ఆంక్షలు అమలులోకి వస్తే గ్లోబల్ మార్కెట్లో వెండి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఇది కేవలం ఆభరణాల రంగాన్నే కాకుండా ఆధునిక సాంకేతిక, ఇంధన రంగాలను కూడా ప్రభావితం చేస్తుంది. భారతీయ మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం, 2026 నాటికి వెండి ధరలు కిలోకు రూ.2.4 లక్షల నుంచి 2.5 లక్షల వరకు చేరే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో వెండి కేవలం ఒక లోహంగా మాత్రమే కాకుండా, వ్యూహాత్మక వనరుగా మారబోతోంది.

# ఢిల్లీలో త్వరలో దర్పణ్ 2.0 ప్రారంభం!

పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన నిర్ణయాలే లక్ష్యంగా ఢిల్లీ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. దేశ రాజధానిలో పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు 'దర్పణ్ 2.0' అనే అధునాతన పర్యవేక్షణ(మానిటరింగ్) డాష్‌బోర్డ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఈ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేసింది.

**ఏమిటీ 'దర్పణ్ 2.0'?**

దర్పణ్ అనేది వివిధ ప్రభుత్వ పథకాలను 24x7 పర్యవేక్షించేందుకు రూపొందించిన ఒక మల్టీ ల్యాంగ్వేజీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్. ఇది కేవలం సమాచారాన్ని చూపడమే కాకుండా, విశ్లేషణాత్మక అంశాలను అందిస్తుంది.

**ఫీచర్లు ఇవే..**

వేర్వేరు విభాగాల మధ్య ఉన్న డేటా అంతరాలను తొలగించి అన్ని ప్రభుత్వ పథకాల పురోగతిని ఒకే చోట చూపిస్తుంది. ప్రభుత్వ పథకాల స్టేటస్‌ను తెలియజేస్తుంది. ఈ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా? అనే అంశాలను ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగా పర్యవేక్షించవచ్చు. రియల్ టైమ్‌లో వీటిని ట్రాక్ చేయవచ్చు. ఏదైనా ప్రాజెక్ట్ నెమ్మదించినా




లేదా అడ్డంకులు ఎదురైనా ఈ సిస్టమ్ అధికారులను ముందుగానే అప్రమత్తం చేస్తుంది. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ) ద్వారా ప్రతి విభాగం పనితీరును స్కోర్ కార్డుల రూపంలో అంచనా వేస్తుంది.

**అమలు ఎప్పుడంటే..**

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ఢిల్లీ ప్రభుత్వం రాబోయే 12 నుంచి 16 వారాల్లో దశలవారీగా అమలు చేయనుంది. ఈ ప్రక్రియలో భాగంగా అన్ని విభాగాల నోడల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. సురక్షితమైన ఏపీఐల ద్వారా ఢిల్లీ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను ఈ డాష్‌బోర్డ్‌కు అనుసంధానిస్తారు.

**భవిష్యత్ లక్ష్యాలు**

డిజిటల్ ఇండియా విజన్‌లో భాగంగా రూపొందుతున్న ఈ వ్యవస్థ భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత విశ్లేషణలకు, పబ్లిక్ డాష్‌బోర్డ్‌లకు పునాది వేయనుంది. దీనివల్ల ప్రభుత్వ పనితీరు ప్రజలకు స్పష్టంగా తెలియడమే కాకుండా, సాక్ష్యాధారిత విధాన ప్రణాళిక రూపొందించడానికి మార్గం సుగమం అవుతుంది.

**ఇదీ చదవండి**

2026 నుంచి చైనా గేమ్ ప్లాన్ ఇదే.. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రూపొందించిన ఈ 'దర్పణ్' మోడల్‌ను ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అమలు చేస్తున్నాయి.

**ఉత్తరప్రదేశ్:**

ఇటీవల యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 'NexGen UPCM DARPAN 2.0' పేరుతో అత్యంత ఆధునిక వెర్షన్‌ను ప్రారంభించింది. ఇందులో 53 విభాగాలకు చెందిన దాదాపు 588 పథకాలను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నారు.

**మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్:**

ఈ రాష్ట్రాల్లో కూడా ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాల పురోగతిని పర్యవేక్షించడానికి దర్పణ్ డ్యాష్‌బోర్డ్ అందుబాటులో ఉంది.

**హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్:**

పర్వత ప్రాంత రాష్ట్రాల్లో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కోసం ఈ ప్లాట్‌ఫామ్‌ను సమర్థవంతంగా వాడుతున్నారు.

**ఈశాన్య రాష్ట్రాలు:**

మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర వంటి రాష్ట్రాలు కూడా తమ జిల్లా స్థాయి ప్రాజెక్టుల పర్యవేక్షణకు దీనినే ఉపయోగిస్తున్నాయి.

**కేంద్రపాలిత ప్రాంతాలు:**

పుదుచ్చేరి, లక్షద్వీప్, చండీగఢ్ వంటి ప్రాంతాల్లో కూడా ఇది అమలులో ఉంది.

# జీడీపీ డేటా కొత్త సిరీస్..

## కేంద్రం ప్రకటన

మార్చిన బేస్ ఇయర్‌తో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి రిటైల్ ద్రవ్యోల్బణం, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) డేటా సిరీస్‌ని విడుదల చేయనున్నట్లు కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ వెల్లడించింది. అలాగే పారిశ్రామికోత్పత్తి కొత్త సిరీస్‌ను మే నెల నుంచి ప్రకటించనున్నట్లు ఒక ప్రకటనలో వివరించింది. దీని ప్రకారం 2024 బేస్ ఇయర్‌గా (100కు సమానం) రిటైల్ ద్రవ్యోల్బణం కొత్త సిరీస్ 2026 ఫిబ్రవరి 12న విడుదల అవుతుంది. అలాగే, 2022-23 ఆర్థిక సంవత్సరం బేస్ ఇయర్‌గా నేషనల్ అకౌంట్స్ డేటాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న, ఐఐపీ డేటా మే 28న విడుదల చేస్తారు.

# ఐఫోన్‌లపై డిస్కౌంట్స్.. కొనేందుకు సరైన సమయం!

ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐఫోన్ 17 ప్రో లాంచ్ అయింది. ఈ మొబైల్ ఫోన్ లాంచ్ అయినప్పటికీ.. చాలామంది ఐఫోన్ 16 ప్రో కొనుగోలు చేయడానికే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అయితే కొందరు మాత్రం ఏ ఫోన్ కొనాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఇప్పుడు ఇయర్ ఎండ్ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలు కూడా వీటిపై ఆకర్షణీయమైన డిస్కౌంట్స్ అందిస్తున్నాయి.

**ఫ్లిప్‌కార్ట్ & అమెజాన్‌లో ధరలు**

యాపిల్ ఐఫోన్ 17 ప్రో 256జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ మోడల్ అమెజాన్ ఇండియాలో రూ.1,34,900కి అందుబాటులో ఉంది. అయితే కొనుగోలుదారులు ఎంపిక చేసిన బ్యాంక్ క్రెడిట్ కార్డులతో రూ.4,000 వరకు తగ్గింపును పొందవచ్చు. ఐఫోన్ 16 ప్రో అసలు ధర రూ.1,19,900 కాగా.. ఫ్లిప్‌కార్ట్‌లో రూ.1,08,



999కు లభిస్తోంది. అంతే కాకుండా ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులు, బ్యాంక్ ఆఫర్స్ వంటివి ఉపయోగించి అదనపు తగ్గింపులను పొందవచ్చు.

**స్పెసిఫికేషన్లు & ఫీచర్లు**

ఐఫోన్ 17 ప్రో 6.3 ఇంచెస్ LTPO సూపర్ రెటినా XDR OLED డిస్‌ప్లేతో 120Hz రిఫ్రెష్ రేట్ & 3000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తుంది. ఇది iOS 26 ఆపరేటింగ్ సిస్టమ్‌తో జత చేయబడిన Apple A19 Pro చిప్‌సెట్ పొందుతుంది. ఇందులో మూడు 48MP సెన్సార్‌లతో సహా ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్‌ను కలిగి ఉంది. సెల్ఫీలు & వీడియో కాల్‌ల కోసం ఇది 18MP ఫ్రంట్ స్నాపర్‌ను కూడా లభిస్తుంది. ఇక ఐఫోన్ 16 ప్రో విషయానికి వస్తే.. ఇది 120Hz రిఫ్రెష్ రేట్‌తో 6.3 అంగుళాల LTPO సూపర్ రెటినా XDR OLED డిస్‌ప్లేను పొందుతుంది. iOS 18 ఆపరేటింగ్ సిస్టమ్‌తో జత చేయబడిన Apple A18 ప్రో చిప్‌సెట్ లభిస్తుంది. అయితే లేటెస్ట్ iOS 26.2కి అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. హ్యాండ్‌సెట్‌లో రెండు 48MP సెన్సార్లు & వెనుక 12MP సెన్సార్ ఉన్నాయి. ముందు భాగంలో, వీడియో కాల్స్ & సెల్ఫీల కోసం 12MP కెమెరా లభిస్తుంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# పిల్లల విద్య కోసం ఐదేళ్లు..

## ఖతార్‌లో ఇషా అంబానీ




ఇండియా & ఖతార్‌లలో.. మ్యూజియం ఇన్ రెసిడెన్స్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్‌లను అభివృద్ధి చేయడానికి ఖతార్ మ్యూజియమ్స్ ముంబై కేంద్రంగా ఉన్న నితా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ (NMACC) మధ్య ఐదు సంవత్సరాలకు ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై ఖతార్ మ్యూజియమ్స్ చైర్‌పర్సన్ షేఖా అల్ మయాసా బింట్ హమద్ బిన్ ఖలీఫా అల్ థానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఇషా అంబానీ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం భారతదేశం.. ఖతార్‌లలో మ్యూజియం ఇన్ రెసిడెన్స్ పేరుతో ప్రత్యేక విద్యా కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. దీని ద్వారా పిల్లలకు ఉల్లాసభరితమైన, మ్యూజియం ఆధారిత అభ్యాస అనుభవాలను పరిచయం చేయనున్నారు. దీని ప్రధాన ఉద్దేశ్యం సృజనాత్మకతను ప్రేరేపించడం. మన దేశంలో ఈ కార్యక్రమాలను రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో.. NMACC అమలు చేస్తుంది. కాగా ఖతార్ మ్యూజియమ్స్ నిపుణులు.. మాస్టర్ క్లాసులు, ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం వహించనున్నారు. ఈ సందర్భంగా ఇషా అంబానీ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తు & విద్యాభివృద్ధి కోసం షేఖా అల్ మయాసా బింట్ హమద్ బిన్ ఖలీఫా అల్ థానీ మరియు ఖతార్ మ్యూజియంలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం మాకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ భాగస్వామ్యంతో నిర్వహించనున్న కార్యక్రమాలు గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలతో సహా పాఠశాలలు, అంగన్‌వాడీలు, కమ్యూనిటీ కేంద్రాలలో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# అమెరికా వదిలేస్తే.. ట్రంప్ ఆఫర్





అమెరికా ప్రభుత్వం ఆ దేశంలోని అక్రమ వలసదారుల కోసం క్రేజీ డీల్ ప్రకటించింది. ఆ దేశంలో ఉన్న అక్రమ వలసదారులు దేశాన్ని వదిలి వెళితే వారికి మూడు వేల డాలర్లు అంటే అక్షరాల రూ. 2.68 లక్షలు ఇస్తానని తెలిపింది. అయితే ఈ ఆఫర్ కేవలం ఈ ఏడాది చివరి వరకే ఉంటుందని కండీషన్ విధించింది. ట్రంప్ ఈ పేరు వింటే చాలు యుఎస్‌లో ఉంటున్న అక్రమ వలసదారులకు కంటిమీద కులుకు ఉండదు. వారిపై ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో అని బెంబేలెత్తిపోతారు. ఎందుకంటే అధికారం చేపట్టి నాటి నుంచి ట్రంప్ ఫస్ట్ టార్గెట్ ఆ దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని తరిమికొట్టడమే. వారిని దేశం నుంచి పంపించడానికి ట్రంప్ ఎన్నో కఠిన చట్టాలు తెచ్చారు. అయినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో వారు వెళ్లకపోవడంతో ప్రస్తుతం వారి కోసం యూఎస్ గవర్నమెంట్ ఒక డీల్ తెచ్చింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ఉంటున్న అక్రమ వలసదారులకు క్రిస్మస్ ఆఫర్ ప్రకటించింది. యూఎస్‌లో ఉంటున్న అక్రమ వలసదారులు ఎవరైతే తమ దేశాన్ని విడిచి వెళ్లాలనుకుంటారో వారికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ మూడు వేల డాలర్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. అంతే కాకుండా వారిపైన ఏవైనా జరిమానాలు, ఇతరత్రా ఏమైనా ఉన్నా రద్దు చేస్తామని పేర్కొంది.

దాని కోసం ఇది వరకే రూపొందించిన సెల్ఫ్ డిపోర్టేషన్ యాప్‌ను ఉపయోగించాలని DHS తెలిపింది. అమెరికాను వదిలి వెళ్లాలనుకునేవారు CBP యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వారి వివరాలను అందులో నమోదు చేయాలని పేర్కొంది. ఆ తర్వాత వారి ప్రయాణ ఖర్చులు తదితర విషయాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ సంస్థ చూసుకుంటుందని తెలిపింది. అక్రమ వలసదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని DHS సెక్రటరీ క్రిస్టి నోయెమ్ తెలిపారు.

ఒకవేళ అక్రమంగా నివాసముంటూ తమకు పట్టుబడితే వారిని అరెస్టు చేసి బలవంతంగా వారి దేశాలకు పంపిస్తామని హెచ్చరించారు. గతంలో అమెరికా వదిలి అక్రమ వలసదారులకు ట్రంప్ వెయ్యి డాలర్లు చెల్లిస్తామని తెలిపారు. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 1.9 మిలియన్ల మంది స్వచ్ఛందంగా అమెరికాను వదిలి వెళ్లినట్లు నివేదికలు తెలుపుతున్నాయి.



# లగ్జరీ హోటల్‌లో ఫ్లైట్ అటెండెంట్ దారుణ హత్య, మాజీ భర్త అరెస్ట్

దుబాయ్‌లోని లగ్జరీ హోటల్‌లో యువతి దారుణ హత్య కలకలం రేపింది. ఫ్లైట్ అటెండెంట్‌గా పనిచేస్తున్న 25 ఏళ్ల యువతిని మాజీ భర్తే కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం దేశం విడిచి పారిపోయాడు. పోలీసులు సమాచారం ప్రచారం రష్యన్ విమానసేవల సంస్థ పోబెడా ఎయిర్ లైన్స్‌లో క్రూ మెంబర్‌గా పనిచేస్తున్న అనస్తాసియా దుబాయ్‌లోని లగ్జరీ ఫైవ్ స్టార్ హోటల్‌లో శవమై తేలింది. దుబాయ్‌లోని జుమేరా లేక్స్ టవర్స్ ప్రాంతంలోని వోకోబోనింగ్టన్ హోటల్‌లోని ఒక గదిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఆమె మెడ, మొండెం, అవయవాలపై 15 కత్తి పోట్లున్నాయని, దర్యాప్తు అధికారులు తెలిపారు. దర్యాప్తు అనంతరం రష్యాలో ఆమె మాజీ భర్తను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడుగా రష్యన్ జాతీయుడు అనస్తాసియా మాజీ భర్త అయిన 41 ఏళ్ల అల్బర్ట్ మోర్గాన్ గా గుర్తించారు. యుఎఇ చట్ట అమలు సంస్థల అభ్యర్థన మేరకు, డిసెంబర్ 20న దుబాయ్ నుండి రష్యాలో దిగిన కొద్దిసేపటికే మోర్గాన్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ హత్య డిసెంబర్ 1718 మధ్య హత్య జరిగిందని భావిస్తున్నారు. హోటల్‌లోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దుబాయ్ పోలీసులు నిందితుడిని గుర్తించారు. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే దేశం విడిచి పారిపోయాడని భావిస్తున్నారు. మోర్గాన్‌ను అదుపులోకి తీసుకుని హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతుండగా, ఫిబ్రవరి 18 వరకు కనీసం రెండు నెలల పాటు కస్టడీలో ఉంచాలని రష్యన్ కోర్టు ఆదేశించింది. అనస్తాసియా మోర్గాన్ మధ్య విభేదాలు తలెత్తాయి. నిరంతరం ఆమెను అనుమానంతో వేధించేవాడు. దీంతో దాదాపు రెండేళ్ల నుంచీ వీరిద్దరూ విడిగా ఉంటున్నారు. ప్రస్తుతం నిందితుడు దుబాయ్‌లో ఉంటున్నాడు. అయితే నిర్భయంగా ఆమె జీవిస్తున్న తీరుపై అసూయ, అనుమానంతో రగిలిపోయి చివరకు ఈ దారుణానికి ఒడిగట్టాడు భర్త. మరోవైపు ప్రభుత్వ సంస్థ ఏరోఫ్లాట్ యాజమాన్యంలోని పోబెడా ఎయిర్‌లైన్స్ ఈ ఘటనపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# ఘోర ప్రమాదం మెస్సీ సోదరికి తీవ్ర గాయాలు, పెళ్లి వాయిదా

ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ, అతని కుటుంబం కష్టకాలంలో ఉన్నారు. ఆయన సోదరి 32 ఏళ్ల మరియా సోల్ ఒక భయంకరమైన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మరియా కారు మయామి రోడ్డుపై నియంత్రణ కోల్పోయి కాంక్రీట్ గోడను ఢీకొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలైనాయి. దీంతో త్వరలోజరగాల్సిన పెళ్లి వాయిదా పడింది. దీంతో మెస్సీ అభిమానులు ఆందోళనలో మునిగిపోయారు. ఈ ప్రమాదంలో ఆమెకు రెండు వెన్నుపూసలు విరిగిపోయాయి, మడమ విరిగింది, చేయి విరిగింది, తీవ్రమైన కాలిన గాయాలయ్యాయి. అయితే ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు తెలుస్తోంది. ఇంటర్ మయామి అండర్19 జట్టు కోచ్ జూలియన్ 'తులి' అరెల్లానోతో తన వివాహానికి మరియా సిద్ధమవుతోంది. జనవరి 3, 2026న వీరి వివాహం జరగాల్సి ఉంది. అర్జెంటీనా టీవీ జర్నలిస్ట్, ప్రెజెంటర్ ఏంజెల్ డి బ్రిటో, తాను మరియా సోల్ తల్లితో మాట్లాడానని, తన కుమార్తె ప్రమాదం నుండి బయటపడిందని తెలిపారని వెల్లడించారు. లియోనెల్ మెస్సీ సోదరి మరియా ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్న వ్యాపారవేత్త డిజైనర్. అంతర్జాతీయ రంగంలో విజయవంతమైన ఫ్యాషన్ బ్రాండ్ బికినిస్ రియో వ్యవస్థాపకురాలు. ఈ బ్రాండ్ ప్రపంచవ్యాప్తంగా పలువురి ఫ్యాషన్ ప్రియులను ఆకర్షించింది.




# బస్సు బోల్తా.. 16 మంది మృతి

**జకార్తా:** ఇండోనేసియాలోని ప్రధాన దీవి జావాలో జరిగిన బస్సు ప్రమాదంలో కనీసం 16 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున సెమరంగ్ నగరంలోని క్రప్యక్ టోల్ ప్లాజా సమీపంలో ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఇండోనేషియాలో పురాతన నగరం యోగ్యకర్త నుంచి రాజధాని జకార్తాకు వస్తున్న ఈ బస్సులో ప్రమాద సమయంలో 34 మంది ప్రయాణికులున్నారు. వేగంగా వస్తున్న బస్సు మలుపులో అదుపుతప్పి కాంక్రీట్ గోడను ఢీకొని, పల్టీ కొట్టింది. ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. దాదాపు 40 నిమిషాలకు పోలీసులు, సహాయక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతకు నుజ్జయిన బస్సులో ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఆరుగురు అక్కడికక్కడే చనిపోగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మరో 10 మంది తుదిశ్వాస విడిచారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగాను, మరో 13 మంది ఆందోళనకరంగాను ఉందని పోలీసులు తెలిపారు. బస్సును నడుపుతున్న అసిస్టెంట్ డ్రైవర్ కూడా క్షతగాత్రుల్లో ఉన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.





# మహా పత్రిక





## అక్టోబరులో దృశ్యం 3



హీరో మోహన్ లాల్, దర్శకుడు జీతూజోసెఫ్ కాంబినేషన్ లో రూపొందిన మలయాళ 'దృశ్యం' ఫ్రాంచైజీకి ఆడియన్స్ లో మంచి క్రేజ్ ఉంది. ఇటీవలే వీరి కాంబినేషన్ లోనే 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణ పూర్తయింది. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది. అయితే 'దృశ్యం' ఫ్రాంచైజీలోని సినిమాలు ఇతర భాషల్లోనూ రీమేక్ అవుతున్న సంగతి తెలిసిందే. హిందీలో అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్నారు. కాగా, హిందీ వెర్షన్ 'దృశ్యం 3' షూటింగ్ మొదలైంది. అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్న ఈ 'దృశ్యం 3' చిత్రానికి అభిషేక్‌పాఠక్ డైరెక్టర్. టబు, శ్రియా శరణ్ ఇతరపాత్రల్లో నటిస్తున్నారు. అలోక్ జైన్ , అజిత్ అంథారే నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరు 2న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. 'దృశ్యం 3' తెలుగు వెర్షన్ లో వెంకటేశ్ హీరోగా నటించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కావాల్సి ఉంది.

## ఓటీటీలో సూపర్ హిట్ సిరీస్..



ఓటీటీలు వచ్చాక వెబ్ సిరీస్‌లకు డిమాండ్ పెరిగిపోయింది. ముఖ్యంగా హారర్, థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లకు ఫుల్ క్రేజ్ ఉంది. అలా వచ్చి నాలుగు సీజన్స్ ప్రేక్షకులను అలరించిన స్ట్రేంజర్ థింగ్స్ మరో సీజన్ వచ్చేందుకు సిద్ధమైంది. ఈ సిరీస్‌లో వచ్చిన నాలుగు సీజన్స్ ప్రేక్షకులను అలరించాయి. ఇప్పుడుస్ట్రేంజర్ థింగ్స్ సీజన్- 5 కూడా వచ్చేస్తోంది. స్ట్రేంజర్ థింగ్స్ సీజన్-5లోని 5,6,7 ఎపిసోడ్‌లు డిసెంబర్ 26 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నాయి. ఇందులోని చివరి ఎపిసోడ్ జనవరి 1 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు ఓటీటీ సంస్థ వెల్లడించింది. 2022లో రిలీజైన సీజన్-4 అత్యధిక వ్యూస్ సాధించిన సిరీస్‌గా నిలిచింది. దీంతో ఈ సిజన్‌పై కూడా ఆడియన్స్‌లో ఆసక్తి నెలకొంది. ఈ సిరీస్‌కు రాస్ డఫర్ దర్శకత్వం వహించారు.

## నీ నీతులు ఇంట్లోనే చెప్పుకో..

### నటుడు శివాజీకి ఆర్జీవీ స్ట్రాంగ్ కౌంటర్



'దండోరా' సినిమా ఈవెంట్‌లో టాలీవుడ్ నటుడు శివాజీ మహిళల వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో వివాదం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ సింగర్ చిన్మయి, అనసూయ, మంచు మనోజ్ అతడికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. అయితే ఈ వివాదంపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తాజాగా స్పందిస్తూ.. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. "శివాజీ పూర్తి పేరు కూడా తనకు తెలియదని పేర్కొంటూనే అతడిని ఉద్దేశిస్తూ ఆర్జీవీ ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "హేయ్ శివాజీ.. నువ్వు ఎవరివైనా, ఎలాంటి వాడివైనా నాకు అనవసరం. నీలాంటి ఒక అసభ్యకరమైన పద్ధతి లేని వ్యక్తిని నీ ఇంట్లో ఆడవాళ్లు భరిస్తున్నారు కాబట్టి.. వెళ్లి నీ నీతులు వాళ్లకి చెప్పుకో. అంతేగాని సమాజంలో ఉన్న మహిళలపై గానీ, చిత్ర పరిశ్రమలో ఉండేవారిపై గానీ నీ చెత్త అభిప్రాయాలను రుద్దకు" అంటూ శివాజీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాగా.. ప్రస్తుతం ఆర్జీవీ చేసిన ఈ వ్యాఖ్యలు ఫిల్మ్ నగర్ వర్గాల్లో వైరల్ అవుతున్నాయి.



## వసూళ్లు తమకు ఇచ్చేయమంటున్న పాక్ ప్రజలు..

'ధురంధర్' సినిమాని పాకిస్థాన్ కరాచీలోని లయరీ అనే ప్రాంతం బ్యాక్‌డ్రాప్‌లో తీశారు. 1990ల్లో అక్కడ జరిగిన గ్యాంగ్ వార్స్‌కి ఓ కల్పిత కథ జోడించి దర్శకుడు ఆదిత్య ధర్ ఈ మూవీ తెరకెక్కించాడు. ప్రస్తుతం రూ.1000 కోట్ల కలెక్షన్స్‌కి చేరువలో ఉంది. అయితే వసూళ్లలో తమకు షేర్ ఇవ్వాలని ఇప్పుడు లయరీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ వీడియోలో లయరీకి చెందిన పలువురు వ్యక్తులు మాట్లాడారు. తమ ప్రాంతాన్ని సినిమాలో చూపించారు కాబట్టి వసూళ్లలో ఎందుకు వాటా ఇవ్వకూడదు? అని అన్నాడు. మరో వ్యక్తి అయితే ఏకంగా 80 శాతం కలెక్షన్స్ తమకు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ మొత్తం ఇవ్వడం వల్ల దర్శకుడికి పెద్దగా పోయేదేం ఉండదని, తర్వాత కూడా ఎలానూ సినిమాల చేస్తాడు కదా అని చెప్పుకొచ్చాడు.

మరో వ్యక్తి మాట్లాడుతూ.. 'ధురంధర్' వసూళ్లలో కనీసం సగానికి సగమైనా సరే లయరీ ప్రజలకు ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశాడు. మరికొంద రైతే రూ.5 కోట్లు, రూ.20 కోట్లు అని నోటికొచ్చినట్లు మొత్తాన్ని చెప్పారు. మరోవ్యక్తి మాత్రం కలెక్షన్స్‌లో కొంత మొత్తంతో ఆస్పత్రి కట్టించి ఇవ్వాలని అన్నాడు. ఇంకో వ్యక్తి అయితే ఒకవేళ దర్శకుడు ఇవ్వాలనుకున్నా సరే తమకు ఒక్క రూపాయి కూడా వచ్చే పరిస్థితి ఉండదని తమ ప్రభుత్వంలో పరిస్థితి ఎలా ఉందో చెప్పకనే చెప్పాడు.

## హీరోయిన్స్ ను మించిన అందం గురూ..



సోషల్ మీడియా పుణ్యమా అని చాలా మంది కొత్త హీరోయిన్స్ టాలీవుడ్ లోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే చాలా మంది అందాల భామలు పరిచయం అయ్యి తమ నటనతో అందంతో ప్రేక్షకులను కవ్విస్తున్నారు. లాక్ డౌన్ సమయంలో సోషల్ మీడియా వాడకం మరింత ఎక్కువైంది. టిక్ టాక్, ఇన్ స్టాగ్రామ్ అంటూ జనాలంతా సోషల్ మీడియాతో బిజీగా మారిపోయారు. కాగా సోషల్ మీడియా వల్ల కొంతమంది తమలో టాలెంట్ ను బయట పెట్టి క్రేజ్ తెచ్చుకున్నారు. రకరకాల రీల్స్ చేసి పాపులర్ కూడా అయ్యారు. అలాగే హీరోయిన్స్ కు మించి క్రేజ్ సొంతం చేసుకున్నారు కొంతమంది ముద్దుగుమ్మలు. ఇక కొంతమంది ఇన్ స్టా బ్యూటీస్ ఇప్పుడు హీరోయిన్స్ గా మారిపోయారు.

### అందంలో స్టార్ హీరోయిన్స్ కు ఏమాత్రం తీసిపోదు.. దోచెయ్ సినిమాలో చైతూ చెల్లెలు గుర్తుందా.?

అలా వచ్చిన వారు చాలా మంది ఉన్నారు. వైష్ణవి చైతన్య, సాక్షి వైద్య, ఇమాన్వి, ఐశ్వర్య శర్మ, రమ్య పసుపులేటి ఇలా చాలా మంది ఉన్నారు. బేబీ సినిమాతో వైష్ణవి పేరు మారుమ్రోగిపోయింది. ఇక ఇప్పుడు మరో సోషల్ మీడియా బ్యూటీ హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వనుంది. ఆమె ఎవరో కాదు ప్రీతీ పగడాల. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా పాపులర్. రకరకాల రీల్స్ చేసి పాపులర్ అయ్యింది. ముఖ్యంగా గుడ్డు మోటివేషన్ అంటూ రకరకాల రీల్స్ చేసింది. అలాగే డ్రసింగ్ గురించి చెప్తు ప్రేక్షకులను ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఈ అమ్మడు ప్రస్తుతం పతంగ్ అనే సినిమాతో హీరోయిన్ గా అడుగుపెడుతుంది. ఈ సినిమాలో ప్రధాన పాత్రలో సింగర్ ప్రణవ్ కౌశిక్ నటిస్తున్నాడు. ఈ సినిమా డిసెంబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, సాంగ్స్, టీజర్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మొత్తానికి మరో తెలుగమ్మాయి సినిమాల్లోకి వస్తుంది. మరి ఈ చిన్నది ఎలా రాణిస్తుందో చూడాలి.

## పైకి నవ్వుతారు.. ఇలాంటి బట్టలెందుకని అనుకుంటారు

ఎప్పుడో ఏదో కామెంట్స్ చేస్తూ హాట్ టాపిక్ అయ్యే తెలుగు నటుడు శివాజీ.. ఇప్పుడు హీరోయిన్లకు డ్రస్సింగ్ సెన్స్ గురించి సలహా ఇచ్చాడు. ఏ బట్టలు పడితే అవి వేసుకునిపోతే మనమే దరిద్రం అనుభవించాల్సి వస్తుందని చెప్పుకొచ్చాడు. అయితే సలహా ఇవ్వడం బాగానే ఉంది కానీ వీటిలో మధ్యలో ఉపయోగించిన ఒకటి రెండు పదాలు మాత్రం కాస్త ఇబ్బందిగా అనిపించాయి. గతంలో తెలుగులో హీరోగా, సహాయ నటుడిగా పలు సినిమాలు చేసిన శివాజీ.. చాన్నాళ్ల పాటు టాలీవుడ్‌లో కనిపించలేదు. 90స్ వెబ్ సిరీస్, కోర్ట్ సినిమాతో హిట్స్ అందుకుని ఇప్పుడు వరస మూవీస్ చేస్తున్నాడు. వాటిలో ఒకటి 'దండోరా'. ఈ గురువారం (డిసెంబరు 25) థియేటర్లలోకి రానుంది. దీని ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో జరగ్గా.. ఇందులోనే మాట్లాడుతూ హీరోయిన్లకు సలహా ఇచ్చాడు. 'హీరోయిన్లు ఏ బట్టలు పడితే ఆ బట్టలు వేసుకుని పోతే మనమే దరిద్రం అనుభవించాల్సి వస్తుంది. హీరోయిన్లు అందరూ ఏమనుకోవద్దు. మీ అందం చీరలోనో, నిండుగా కప్పుకొనే బట్టల్లోనే ఉంటుంది తప్పితే సామాను కనిపించే దానిలో ఏం ఉండదు. అవి వేసుకున్నంత మాత్రాన చాలామంది చూసినప్పుడు నవ్వుతారు గానీ.. దరిద్రపు ము**, ఇలాంటి బట్టలెందుకు వేసుకున్నావ్, మంచివి వేసుకోవచ్చుగా బాగుంటావుగా అని అనాలపిస్తుంది లోపల కానీ అనలేం. మళ్లీ అంటే స్త్రీ స్వాతంత్ర్యం లేదా స్వేచ్ఛ లేదా అంటారు. స్త్రీ అంటే ప్రకృతి, ఎంత అందంగా ఉంటే అంత గౌరవం పెరుగుతుంది. ఈ ప్రకృతి అద్భుతంగా ఉంటది. అలాగే స్త్రీ మా అమ్మ.. చక్కగా ఎప్పటికీ గుండెల్లో కనబడతా ఉంటుంది. గ్లామర్ అనేది ఒకదశ వరకే ఉండాలి. స్వేచ్ఛ అనేది అదృష్టం. దాన్ని కోల్పోవద్దు. మన గౌరవం ఎప్పుడు పెరుగుద్ది అంటే మన వేషభాషల నుంచే గౌరవం పెరుగుతుంది' అని శివాజీ చెప్పుకొచ్చాడు. ఈ మొత్తం స్పీచ్‌లో సామాను, దరిద్రపు ము** అనే పదాలు ఉపయోగించడం కాస్త అభ్యంతరకరంగా అనిపించింది. ఎందుకంటే సోషల్ మీడియాలో దీన్ని బూతు అర్థం వచ్చేలా మాట్లాడతారు. బయట ఎవరో దీన్ని అన్నారంటే ఏమోలే అనుకోవచ్చు గానీ పబ్లిక్‌గా స్టేజీపై ఓ నటుడు ఈ పదాలు ఉపయోగించడం అవసరమా అనేది ఇక్కడ ప్రశ్న.



## శంబాలపై పాజిటివ్ వైబ్ ఉంది: కిరణ్ అబ్బవరం



''ఎస్ఆర్ కళ్యాణ మండపం' సినిమాలో ధర్మపాత్ర కోసం సాయి కుమార్‌గారిని కలిసినప్పుడు ఆయన మాకు చేసిన సపోర్ట్‌ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన వల్లే నా కెరీర్ బాగుందనుకుంటూ ఉంటాను. 'శంబాల' చిత్రంపై ముందు నుంచి పాజిటివ్ వైబ్ ఉంది.. తప్పకుండా అందరికీ నచ్చుతుంది. ఈ మూవీతో ఆదిగారికి మంచి విజయం రావాలి'' అని కిరణ్ అబ్బవరం తెలిపారు. ఆది సాయికుమార్, అర్చనా అయ్యర్ జోడీగా నటించిన చిత్రం 'శంబాల'. యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరోలు మంచు మనోజ్, కిరణ్ అబ్బవరం, ప్రియదర్శి, అశ్విన్ బాబు, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్, నిర్మాతలు నవీన్ యెర్నేని, టీజీ విశ్వ ప్రసాద్, మైత్రి శశిధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంచు మనోజ్ మాట్లాడుతూ–''చిన్న సినిమా పెద్ద సినిమా అని ఉండదు.. మంచి చిత్రాల్ని ప్రేక్షకులు ఆదరిస్తూనే ఉంటారు'' అన్నారు. ''సాయికుమార్‌గారి కొడుకుని అని చెప్పుకోవడాన్ని గర్వంగా భావిస్తాను'' అని ఆది సాయికుమార్ తెలిపారు. ''ఈ చిత్రంతో ఆదికి మంచి విజయం దక్కాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''శంబాల'తో ఆదికి చిత్రోత్సాహం, నాకు పుత్రోత్సాహం, టీమ్‌కి విజయోత్సాహం రావాలని కోరుకుంటున్నాను'' అని నటుడు సాయికుమార్ చెప్పారు. ''నా టీమ్ సపోర్ట్ వల్లే సినిమాను ఇంత గొప్పగా తీశాను'' అని యుగంధర్ ముని పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com